ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 66 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 12 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :66 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 12 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## అది భక్తి కాదు... రాజకీయ నటన

### పవన్ కల్యాణ్ పై రోజా ఫైర్

- సనాతన ధర్మంపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు... మండిపడ్డ రోజా
- పవన్ ఆందోళనంతా రాజకీయ నటన అని విమర్శ
- చంద్రబాబును రక్షించడానికే ధర్మంపై మాట్లాడుతున్నారని ఆరోపణ
- పవన్ ప్రసంగాల్లో చిత్తశుద్ధి లోపించిందని వ్యాఖ్య
- తిరుమలకు బోర్డులు కాదు నిజాయతీ అవసరమని స్పష్టం
- ముందు నిలకడగా ఉండటం నేర్చుకోవాలని పవన్‌కు హితవు



పెన్ పవర్ డెస్క్:సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. తాజాగా, ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రోజా కూడా పవన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

వివరాలు 2లో..

## కార్యకర్తే అధినేత... అధికారంలో ఉన్నాం అని నిర్లక్ష్యం వద్దు

- టీడీపీ జోనల్ కోఆర్డినేటర్లతో నారా లోకేశ్ కీలక సమావేశం
- ఈ నెలాఖరులోగా పార్టీ, నామినేటెడ్ పదవులన్నీ భర్తీ చేస్తామని ప్రకటన
- ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలు తీర్చాలని స్పష్టీకరణ
- వైసీపీ హయాంలోని అక్రమ కేసులను సమీక్షించి న్యాయం చేస్తామని హామీ
- ఇంఛార్జ్ మంత్రులు, మిత్రపక్షాలతో సమన్వయంగా పనిచేయాలని సూచన



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన అధినేతలని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందని మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నేడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు, నాయకులకు ఆయన పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

"టీడీపీ సిద్ధాంతం ప్రకారం పార్టీలో కార్యకర్తే అధినేత. ఈ విధానం పక్కాగా అమలవ్వాలి. ప్రతీ కార్యకర్తకు తగిన గౌరవం, ప్రాధాన్యం దక్కేలా చూడాలి. అధికారంలోకి వచ్చామన్న భావనతో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత కసితో, పట్టుదలతో పనిచేశామో, ఇప్పుడు అంతకుమించిన ఉత్సాహంతో పనిచేసి కార్యకర్తలకు అండగా నిలవాలి" అని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రజలకు, కార్యకర్తలకు మధ్య వారధిగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**నెలాఖరులోగా పదవుల భర్తీ**

ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు తప్పనిసరిగా 'గ్రీవెన్స్' కార్యక్రమాలు నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని తమ స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులను ఈ నెలాఖరులోగా భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వివరాలు 2లో..



## అమరావతి విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్...

### ఏపీ సమస్యలు వివరించిన సీఎం చంద్రబాబు

- సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భేటీ
- గంటపాటు కొనసాగిన కీలక సమావేశం
- రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీటి అంశాలపై చర్చ
- మొంథా తుపాను నష్టాన్ని వివరించిన ముఖ్యమంత్రి
- రైతుల కోసం రూ. 695 కోట్ల అదనపు నిధులు కోరిన సీఎం
- తోతాపూరి రైతులకు రూ. 100 కోట్లు విడుదల చేయాలని వినతి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భేటీ అయ్యారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం నాడు అమరావతిలోని సీఎం క్యాంపు

వివరాలు 2లో..

## ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం

### భూటాన్ నుంచి మోదీ హెచ్చరిక

- ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారులో భారీ పేలుడు
- భూటాన్ పర్యటన నుంచే తీవ్రంగా స్పందించిన ప్రధాని
- బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంటుందని భరోసా



పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణానికి పాల్పడిన కుట్రదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. నిన్న సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 13 మంది మరణించగా, 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు రోజుల

వివరాలు 2లో..

## బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం... ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

- బీహార్ లో నేడు ముగిసిన రెండో విడత పోలింగ్
- ఎగ్జిట్ పోల్స్ వెల్లడి.. ఎన్డీయేకు భారీ మెజారిటీ అంచనా
- మహాగట్బంధన్‌కు నిరాశ తప్పదంటున్న సర్వేలు
- పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్
- ఎన్డీయే వైపు భారీగా మొగ్గు చూపిన మహిళా ఓటర్లు
- దాదాపు అన్ని సర్వేల్లోనూ బీజేపీ కూటమికే పట్టం

వివరాలు 2లో..




## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్... ఆరుగురు మావోయిస్టుల మృతి



- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన
- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- మావోయిస్టుల ఉనికి తగ్గిపోయిందన్న బస్తర్ రేంజ్ ఐజీ
- తప్పించుకున్న మావోల కోసం అడవులను జల్లెడ పడుతున్న బలగాలు

పెన్ పవర్ డెస్క్:ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర

వివరాలు 2లో..

## జూబ్లీహిల్స్ ఎన్నికపై బెట్టింగ్




- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై వందల కోట్ల రూపాయల బెట్టింగ్...!
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ
- ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగులు బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగులు

పెన్ పవర్ డెస్క్:జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అది .కారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తుండటం, అత్యధికంగా సెటిలర్ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కావడంతో ఈ ఉప ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్

వివరాలు 2లో..

## నేను మాటిస్తున్నా.. ఢిల్లీ పేలుళ్లకు కారణమైన ఏ ఒక్కరినీ వదలిపెట్టం



పెన్ పవర్ డెస్క్:: దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుళ్ల ఘటనపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్?నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పేలుళ్లకు బాధ్యులైన ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నిందితులను చట్టం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇస్తున్నానని అన్నారు.ఢిల్లీ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. దర్యాప్తు సంస్థలు ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నాయని తెలిపారు. విచారణ పూర్తి కాగానే నివేదిక ఆధారంగా

వివరాలు 2లో..

## విజయనగరం ఉగ్ర కుట్ర కేసు... ఇద్దరిపై చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ

- ఏపీ, తెలంగాణ టెర్రర్ కుట్ర కేసులో ఇద్దరిపై చార్జిషీట్
- సోషల్ మీడియా ద్వారా యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్నారని ఆరోపణ
- నిందితుల్లో ఒకరు విజయనగరం వాసి, మరొకరు హైదరాబాద్ వాసి
- విశాఖ నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరు దోషులకు జైలుశిక్ష
- నిందితులకు 5 ఏళ్ల 10 నెలల సాధారణ జైలుశిక్ష ఖరారు
- యూఏపీఏ, అధికార రహస్యాల చట్టం కింద శిక్ష విధించిన కోర్టు

వివరాలు 2లో..




## తిరుపతి లడ్డూ కేవలం స్వీట్ కాదు... హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు

- సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలంటూ పవన్ కల్యాణ్ ట్వీట్
- తిరుపతి లడ్డూ కేవలం ప్రసాదం కాదు, అది ఒక ఉమ్మడి భావోద్వేగం అని వెల్లడి
- సనాతన ఆచారాలను ఎగతాళి చేయడం కోట్ల మంది నమ్మకాన్ని దెబ్బతీయడమేనని వ్యాఖ్యలు
- లౌకికవాదం అనేది రెండు వైపులా ఉండాలని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్త హిందూ సమాజానికి కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదని, అదొక పవిత్రమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా

వివరాలు 2లో..

## ఓ మై గాడ్... నాకు నిజంగా ఆశ్చర్యం వేస్తోంది

### పవన్ కల్యాణ్ పై అంబటి రాంబాబు ఫైర్

- తిరుపతి, సింహాచలంలో భక్తులు చనిపోయినప్పుడు పవన్ ఎక్కడ ఉన్నారన్న అంబటి
- టీడీపీ నేత వద్ద లక్షల కిలోల గోమాంసం దొరికితే ఎందుకు స్పందించలేదని ప్రశ్న
- వైసీపీ ర్యాలీలకు ముందు చంద్రబాబు చెప్పినట్టే పవన్ ట్వీట్లు చేస్తున్నారా? అంటూ ఆగ్రహం
- సనాతన ధర్మ యోధుడినని చెప్పుకోవడం వెనుక ఉన్న నిజ స్వరూపం ఇదేనా? అంటూ ట్వీట్



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఎన్డీయే గెలిచినా నితీష్ కి ఛాన్స్ ఎంతవరకు ?

బీహార్ సీఎం గా గత రెండు దశాబ్దాలుగా నితీష్ కుమార్ పాలిస్తున్నారు. మధ్యలో కొన్ని నెలలు తప్ప 2005 నుంచి ఆయనే బీహార్ సీఎం గా ఉన్నారు. 2020లో ఎన్డీయే కూటమితో జత కట్టి నితీష్ సీఎం అయ్యారు. ఈసారి కూడా ఆయన ఎన్డీయేతో కలిసే ఎన్నికలకు వెళ్ళారు. అయితే ఈసారి ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి నితీష్ మళ్ళీ సీఎం కారు అని విపక్షం ప్రచారం చేస్తూ వచ్చింది. అంతే కాదు రాజకీయ విశ్లేషణలు అలాగే వెలువడ్డాయి. ఇక చూస్తే మంగళవారంతో రెండవ విడత పోలింగ్ ముగిసింది. ఈ నెల 14న ఫలితాలు రానున్నాయి.

**వార్ వన్ సైడేనా :**

ఇలా పోలింగ్ ముగిసిందో లేదో ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఒక్కోటిగా బయటకు వచ్చాయి. బీహార్ లో ఎవరు అధికారం చేపడతారు అన్నది చూస్తే కనుక ఎన్డీయేకే అవకాశాలు అన్నీ దాదాపుగా అనేక సర్వే ఏజెన్సీలు గట్టిగానే చెప్పేశాయి. ఒక విధంగా చెప్పాలీ అంటే వార్ వన్ సైడ్ గా సాగింది అని అంటున్నారు. మహా ఘట్ బంధన్ ఈసారి తప్పకుండా పవర్ లోకి వస్తుందని భావించినా ఏ ఒక్క సర్వే కూడా అధికారంలోకి దరిదాపుల్లోకి వస్తుందని తేల్చి చెప్పలేదు. దాంతో ఎన్డీయే గెలుపు ఖాయమని ప్రచారం ఊపందుకుంది.

**కొత్త చర్చ :**

ఇక బీహార్ లో ఎవరు సీఎం అవుతారు అన్నది కొత్త చర్చగా ముందుకు వస్తోంది. ఎన్డీయే గెలిస్తే నితీష్ కుమార్ సీఎం అని అంతా అనుకుంటున్నారు. కానీ బిగ్ ట్విస్ట్ ఏమైనా ఉంటుందా అన్నదే ఇపుడు హాట్ డిబేట్ కి కారణం. బీజేపీ అయితే బీహార్ సీఎం పదవి మీద కన్నేసింది అని చాలా కాలంగా చెబుతున్నారు. ఆ పార్టీకి చెందిన ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కీలకంగా ఉన్నారు. ఆయన బీహార్ ఎన్డీయేలో అత్యంత ముఖ్య పాత్ర సైతం పోషిస్తున్నారు. పేరు చెప్పకపోయినా ఆయననే బీజేపీ ప్రొజెక్ట్ చేస్తూ వస్తోంది. ఎన్డీయే ఎన్నికల మ్యానిఫేస్టో సైతం నితీష్ కుమార్ తో కలసి ఆయన ఆవిష్కరించారు. దాంతో ఆయనకు అవకాశాలు ఉన్నాయా అన్నదే కొత్త చర్చ.

**జేడీయూ బెటర్ పొజిషన్ :**

అయితే ఎగ్జిట్ పోల్ సర్వేలు చూస్తే కనుక గతం కంటే ఎన్డీయేకు ఎక్కువ సీట్లు వస్తాయని తేల్చాయి. అందులో బీజేపీతో పాటు జేడీయూ సైతం మంచి పర్ఫార్మెన్స్ చేసిందని కనిపిస్తోంది. ఆ విధంగా విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే ఈ సర్వేలలో పేర్కొన్న మేరకు ఎన్డీయేకు 160 సీట్ల దాకా వస్తే మాత్రం నితీష్ కుమార్ సీఎం కాకపోవచ్చు అని అంటున్నారు. అపుడు బీజేపీకి చెందిన వారే సీఎం గా ఉంటారు అని అంటున్నారు. జేడీయూలో కొంత అసంతృప్తి ఉన్నా దానిని దాటుకుని ముందుకు వెళ్ళే సంఖ్యా బలం ఎన్డీయేకు ఈ లార్జ్ నంబర్ తో ఉంటుందని అంటున్నారు. అలా కాకుండా నంబర్ ఏ 130 దగ్గరలో ఆగిపోతే మాత్రం నితీష్ కుమార్ కి చాన్స్ రావచ్చు అన్నది మరో చర్చ. మొత్తానికి చూడాల్సి ఉంది. ఎన్డీఏ గెలిస్తే కనుక నితీష్ కుమార్ సీఎం అవుతారా లేక కొత్త సీఎం వస్తారా అన్నది.

# అది భక్తి కాదు... రాజకీయ నటన

- మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్ ధర్మం గురించి మాట్లాడటం కేవలం రాజకీయ నటన అని, అందులో ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆమె ఆరోపించారు."పవన్ కళ్యాణ్ గారూ, మీరు పవిత్రత, ధర్మం గురించి మాట్లాడిన ప్రతీసారి మీ పక్షపాత వైఖరి స్పష్టంగా బయటపడుతుంది. మీ ఆందోళన కేవలం ఎంపిక చేసుకున్న అంశాలకే పరిమితమని తెలిసిపోతుంది. తిరుమలలో భక్తులు చనిపోయినప్పుడు గానీ, వ్యవస్థలో తీవ్రమైన లోపాలు బయటపడినప్పుడు గానీ మీ నోరు పెగలలేదు. కానీ, ఎప్పుడైతే చంద్రబాబుకు ఒక రక్షణ కవచం అవసరమవుతుందో, అప్పుడు హఠాత్తుగా మీరు ధర్మం గురించి ప్రవచనాలు మొదలుపెడతారు.దీన్ని భక్తి అనరు, స్వచ్ఛమైన రాజకీయ నటన అంటారు. మీరు నిజాయతీ గురించి మాట్లాడతారు, కానీ నిజాయతీ అంటే మనకు అసౌకర్యంగా ఉన్నప్పుడు కూడా నిజాన్ని నిర్భయంగా చెప్పగలగడం. మీరు ఆ పని ఎప్పుడూ చేయలేదు. మీ సొంత మిత్రపక్షాల నుంచి జవాబుదారీతనం రాబట్టాల్సిన సమయం వచ్చినప్పుడు మౌనంగా ఉంటూ, సులభమైన లక్ష్యాలను ఎంచుకుని విమర్శలు చేస్తారు. అందుకే మీ ధర్మోపన్యాసాలు డొల్లగా వినిపిస్తున్నాయి.ధర్మం గురించి గొప్ప ప్రసంగాలు ఎవరైనా ఇవ్వగలరు. కానీ అసలైన అవసరం వచ్చినప్పుడు దాని కోసం నిలబడే ధైర్యం ఎవరికి ఉంది అన్నదే అసలైన ప్రశ్న. ఆ పరీక్షలో మీరు ప్రతీసారీ విఫలమయ్యారు. తిరుమల సమస్యలను ఏదో ఒక బోర్డు లేదా కమిటీ పరిష్కరించదు. చిత్తశుద్ధి, నిజాయతీ మాత్రమే పరిష్కరించగలవు. కానీ ఆ రెండూ మీ రాజకీయాల్లో కొరవడ్డాయి.ఇతరులకు నీతులు చెప్పే ముందు, ముందు మీరు నిలకడగా ఉండటం నేర్చుకోండి. తిరుమలకు కావాల్సింది చిత్తశుద్ధి... మీలాంటి వారి స్క్రిప్టెడ్ ఆక్రోశాలు కాదు" రోజా హితవు పలికారు.

# విజయనగరం ఉగ్ర కుట్ర కేసు... ఇద్దరిపై చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విజయనగరం టెర్రర్ కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక ముందడుగు వేసింది. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులపై విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో మంగళవారం చార్జిషీట్ దాఖలు చేసింది. నిందితుల్లో ఒకరు విజయనగరం జిల్లాకు చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్ కాగా, మరొకరు తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు ప్రాంతాల్లో దాడులకు కుట్ర పన్నారనేది వీరిపై ప్రధాన ఆరోపణ. ఈ మేరకు వారిపై భారతీయ న్యాయ సంహిత , పేలుడు పదార్థాల చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ) కింద అభియోగాలు నమోదు చేశారు.

గత మే 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సిరాజ్, సమీర్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం కేసు తీవ్రత దృష్ట్యా ఎన్ఐఏ దర్యాప్తును చేపట్టింది. నిందితులు ఐసిస్ భావజాలంతో ప్రభావితమై, ఇన్‌స్టాగ్రామ్, సిగ్నల్ వంటి యాప్‌లలో పలు గ్రూపులు క్రియేట్ చేసి వందలాది మంది యువతను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రచారానికి పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దేశ సమగ్రత, భద్రత, మత సామరస్యానికి భంగం కలిగించేలా వీరి కార్యకలాపాలు సాగాయని అధికారులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది.

**నేవీ గూఢచర్యం కేసులో ఇద్దరికి జైలుశిక్ష**

ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌తో సంబంధాలున్న విశాఖపట్నం నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరు నిందితులకు ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు చేసింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన కలవలపల్లి కొండబాబు,

హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన అవినాశ్ సోమల్‌కు 5 సంవత్సరాల 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది.యూఏపీఏ సెక్షన్ 18, అధికార రహస్యాల చట్టంలోని సెక్షన్ 3 కింద కోర్టు వీరిని దోషులుగా తేల్చింది. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

# కార్యకర్తే అధినేత... అధికారంలో ఉన్నాం అని నిర్లక్ష్యం వద్దు

- మొదటి పేజి తరువాయి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులన్నింటినీ సమీక్షించి, వారికి చట్టపరంగా న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

**సమన్వయంతో ముందుకు సాగాలి**

రాష్ట్రంలోని అన్ని జోన్ల కోఆర్డినేటర్లు తమ పరిధిలోని ఇంఛార్జ్ మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని లోకేశ్ సూచించారు. ముఖ్యంగా జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ ఇంఛార్జ్‌లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్లు ప్రతి నియోజకవర్గంలో పర్యటించి, పార్టీ వ్యవహారాలపై సమీక్షలు జరపాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు మధ్య సత్సంబంధాలు పెంచే బాధ్యత కోఆర్డినేటర్లదేనని స్పష్టం చేశారు. క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి కార్యకర్తలు, కుటుంబ సాధికార సారథులతో సమావేశాలు నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు.

ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్‌లు పింఛన్ల పంపిణీ, గ్రీవెన్స్, క్యాడర్ మీటింగ్స్, స్వచ్ఛాంధ్ర వంటి కార్యక్రమాలలో తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని జోనల్ కోఆర్డినేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమాలపై వారు సమర్పించే నివేదికలను పార్టీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందని తెలిపారు. పార్టీ ప్రమాద బీమాకు సంబంధించిన చెక్కులను కూడా సకాలంలో బాధిత కుటుంబాలకు అందజేయాలని ఆదేశించారు. ప్రతీ నాయకుడు పార్టీ నిర్దేశించిన మార్గంలోనే నడవాలని, సమష్టి కృషితో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జోనల్ కోఆర్డినేటర్లు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీదా రవిచంద్ర యాదవ్, దామచర్ల సత్య, సుజయ్ కృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవి రావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం... ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో చెబుతున్నాయి. మంగళవారం రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన దాదాపు అన్ని సర్వేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకే అధికారాన్ని కట్టబెట్టాయి. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్ కూటమికి తీవ్ర నిరాశ తప్పదని అంచనా వేశాయి.వివిధ జాతీయ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఎన్డీయేకు 130 నుంచి 167 సీట్ల వరకు దక్కే అవకాశం ఉంది. మరోవైపు, మహాగట్బంధన్ కూటమి 70 నుంచి 108 స్థానాల మధ్య పరిమితం కావొచ్చని తెలుస్తోంది. బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం కాగా, ఎన్డీయే సునాయాసంగా ఆ మార్కును దాటుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతారని భావించిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏమాత్రం సత్తా చాటలేకపోయిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0 నుంచి 5 సీట్ల లోపే వస్తాయని పేర్కొన్నాయి. దీంతో, బీహార్ రాజకీయాలపై 'పీకే ఫ్యాక్టర్' పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, 65 శాతం మంది మహిళా ఓటర్లు ఎన్డీయేకు మద్దతుగా నిలిచినట్లు ఈ సర్వే వెల్లడించింది. అలాగే, 51 శాతం ఓబీసీలు, 49 శాతం ఎస్సీ ఓటర్లు కూడా ఎన్డీయే వైపే మొగ్గు చూపినట్లు పేర్కొంది.మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్న బీహార్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈ విధంగా ఉన్నప్పటికీ, పూర్తి ఫలితాలు తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.

బీహార్ లో మొత్తం 243 స్థానాలకు గాను... నవంబరు 6న జరిగిన తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. నేడు (నవంబరు 11) రెండో విడతలో మిగిలిన 122 స్థానాలకు పోలింగ్ చేపట్టారు. పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియగానే, ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి. రెండు విడతల పోలింగ్ పూర్తయ్యాక ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉందో చూస్తే...

# ఓ మై గాడ్... నాకు నిజంగా ఆశ్చర్యం వేస్తోంది

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని, ఆయన పూర్తిగా చంద్రబాబు చేతిలో రాజకీయ కీలుబొమ్మగా మారారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేవలం చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను అనుసరిస్తూ, ఆయన రాజకీయ ప్రయోజనాల కోసమే పవన్ పనిచేస్తున్నారని అంబటి ధ్వజమెత్తారు."ఓ మై గాడ్... నిజంగా నాకు ఆశ్చర్యం వేస్తోంది. సనాతన ధర్మ యోధుడినని చెప్పుకునే పవన్ కల్యాణ్ గారు ఎట్టకేలకు తన సుదీర్ఘ నిద్ర నుంచి బయటకు వచ్చారు. కానీ ఆయన వచ్చింది న్యాయం కోసమో, ధర్మం కోసమో కాదు. కేవలం చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం వాయించే ప్రచార డప్పుకు అనుగుణంగా డ్యాన్స్ చేయడానికి మాత్రమే! ఇది చూస్తుంటే నాకు నవ్వొస్తోంది. నేను సూటిగా అడుగుతున్నాను. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయినప్పుడు ఈ ధర్మ పరిరక్షకుడు ఎక్కడికి వెళ్లారు? సింహాచలంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయినప్పుడు ఈయన దైవాగ్రహం ఏమైంది? కాశీబుగ్గలో తొమ్మిది మంది అమాయకులు మరణించినప్పుడు ఈ మహాయోధుడు ఎందుకు కనిపించలేదు? ఒక్కటంటే ఒక్క సంఘటన జరిగిన చోటుకు ఆయన వెళ్లలేదు. ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం ప్రగాఢ సానుభూతి కూడా ప్రకటించలేదు. ఒక ప్రజా నాయకుడి నుంచి కనీసం ఆశించే మానవత్వం కూడా చూపించకుండా, బాధిత కుటుంబాలను కలవకుండా ఏం సాధించారు?ఇక అసలు విషయానికి వద్దాం. విశాఖపట్నంలో టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తాకు చెందిన కోల్డ్ స్టోరేజ్‌లో 1,89,000 కిలోల గోమాంసం పట్టుబడినప్పుడు, సనాతన ధర్మాన్ని కాపాడతానని చెప్పే పవన్ కల్యాణ్ గారు మళ్ళీ మాయమైపోయారు. ఆ ఘటనపై ఆయనలో ఎలాంటి ఆగ్రహం లేదు, కనీసం

ఖండన లేదు. కేవలం నిశ్శబ్దం, కపటత్వం మాత్రమే కనిపించాయి.కానీ ఈ రోజు, సరిగ్గా నవంబర్ 12న వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ తలపెట్టిన ర్యాలీలకు ముందు, పవన్ గారు అకస్మాత్తుగా మేల్కొన్నారు. వెంటనే 'ఎక్స్' లోకి వచ్చి చంద్రబాబు అందించిన పాత చింతకాయ పచ్చడి లాంటి స్క్రిప్ట్‌ను వల్లించడం మొదలుపెట్టారు. పవన్ గారూ, దీన్ని ధర్మం అనరు. ఇది నిస్సిగ్గుగా చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా మారి చేస్తున్న రాజకీయ నాటకం. ఇది మీ నిబద్ధతను, మీ సిద్ధాంతాలను మీరే అపహాస్యం చేసుకోవడం కాదా? జనం అన్నీ గమనిస్తున్నారన్న విషయం మీకు గుర్తుందా?" అంటూ అంబటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# తిరుపతి లడ్డూ కేవలం స్వీట్ కాదు... హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు

- మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కేవలం ఒక స్వీట్ కాదు, అది మనందరి ఉమ్మడి భావోద్వేగం. స్నేహితులు, కుటుంబ సభ్యులు, చివరికి అపరిచితులతో కూడా మనం ఆ ప్రసాదాన్ని పంచుకుంటాం. ఎందుకంటే, అది మన సామూహిక విశ్వాసానికి, ప్రగాఢ భక్తికి ప్రతీక" అని వివరించారు. ఏటా సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని గుర్తుచేశారు."సనాతనుల మనోభావాలను, ఆచారాలను ఎగతాళి చేసినప్పుడు లేదా కించపరిచినప్పుడు అది కేవలం బాధ కలిగించడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. లౌకికవాదం అనేది రెండు వైపులా ఉండాలి. మా విశ్వాసానికి రక్షణ, గౌరవం ఇవ్వడంలో రాజీ పడకూడదు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.మన సనాతన ధర్మం అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికత అని పేర్కొన్న పవన్, భాగస్వాములందరి ఏకాభిప్రాయంతో 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను స్థాపించడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు.అంతకుముందు, నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో తిరుపతి లడ్డూ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. "పాలు లేని కల్తీ నెయ్యిలో మతోన్మాదాన్ని కలపకుండా, కల్తీ రాజకీయం చేయకుండా ఇప్పటికైనా తప్పు చేసిన వాడిని శిక్షించే పని చూడండి" అంటూ ట్వీట్ చేశారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికపై బెట్టింగ్

- మొదటి పేజి తరువాయి

పార్టీల మధ్య హోరాహోరీ పోరు కనిపించింది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. దాదాపు 500 కోట్ల రూపాయల వరకు బెట్టింగ్‌లు జరిగాయని తెలుస్తోంది. గెలుపుతో పాటు మెజార్టీపై కూడా బెట్టింగ్‌లు వేసినట్లు చెబుతున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా పెద్ద ఎత్తున బెట్టింగ్ కాశారని సమాచారం.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందే అవకాశాలు ఉన్నాయని ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలుపుతున్నాయి.

# నేను మాటిస్తున్నా.. ఢిల్లీ పేలుళ్లకు కారణమైన ఏ ఒక్కరినీ వదలిపెట్టం

- మొదటి పేజి తరువాయి

ఈ విషాదానికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని వార్నింగ్ ఇచ్చారు.ఢిల్లీ పేలుడు బాధితులకు సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కూడా నివాళులర్పించింది. సుప్రీంకోర్టు చట్ట నియమాలను కాపాడటానికి కట్టుబడి ఉందని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో సుప్రీంకోర్టు దేశ పౌరులకు అండగా నిలుస్తుందని అన్నారు.

# అమరావతి విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్... ఏపీ సమస్యలు వివరించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల సంక్షేమానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వ సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన 'మొంథా' తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తుపాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్రం నుంచి ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎం-ఆర్కేవీవై-పీడీఎంసీ (ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన - పర్ డ్రాప్ మోర్ క్రాప్) పథకం కింద రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించాలని కోరారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి రూ. 695 కోట్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.అదేవిధంగా, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను చంద్రబాబు వివరించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా రూ. 100 కోట్లను వెంటనే విడుదల చేయాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. రాష్ట్ర రైతాంగ సమస్యలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.ఈ సమావేశంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు.

# ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం

- మొదటి పేజి తరువాయి

పర్యటన నిమిత్తం భూటాన్‌లో ఉన్న ప్రధాని మోదీ... థింపూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ పేలుళ్ల వెనుక ఉన్న కుట్రను మన దర్యాప్తు సంస్థలు ఛేదిస్తాయి. సూత్రధారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ న్యాయస్థానం ముందు నిలబెడతాం" అని మోదీ స్పష్టం చేశారు.ఢిల్లీ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చానని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "నిన్న సాయంత్రం జరిగిన ఈ భయానక ఘటన అందరినీ విషాదంలోకి నెట్టింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను అర్థం చేసుకోగలను. ఈ కష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న అన్ని ఏజెన్సీలతో తాను రాత్రంతా టచ్‌లోనే ఉన్నానని ప్రధాని వెల్లడించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్... ఆరుగురు మావోయిస్టుల మృతి

- మొదటి పేజి తరువాయి

ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు.పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి.ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు.ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

# అంతర్జాతీయ సెమినార్ పాల్గొన్న విచ్చేసిన ప్రిన్సిపాల్

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 11:-** డిగ్రీ కళాశాల చింతపల్లి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ సెమినార్లో పాల్గొని ఈరోజు కళాశాలకు విచ్చేశారు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక అధ్యాపకేతర మరియు మరియు విద్యార్థినీ విద్యార్థులు హార్దిక స్వాగతం పలికారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయ భారతి మాట్లాడుతూ వివిధ దేశాలకు సంబంధించిన వ్యక్తులతో పరిచయ అనుభవాలను మరియు సెమినార్ అంశాలను వివరించారు ఈ విదేశీ పర్యటన విద్యార్థినీ విద్యార్థులకు ఒక స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పెదవలస "దిగ వీధి"లో ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యటన



పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పెదవలస పంచాయతీ కేంద్రంలో గల "దిగ వీధి" గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి కష్టాలను వెలికితీస్తూ పెన్ పవర్ పత్రిక మంగళవారం "పెదవలస దిగ వీధి గ్రామంలో నీటి కొరత- నేటికీ ఊట నీరే ఆధారం" అంటూ వార్తను


పెదవలస "దిగవీధి" గ్రామంలో నీటి కొరత -
నేటికీ ఊట నీరే ఆధారం

ప్రచురించింది. దీనిపై వెంటనే పంచాయితీ సెక్రటరీ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి దిగ వీధి గ్రామంలో పర్యటించారు. ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డిఈ జి.కరుణ,ఏఈ కళ్యాణ్ బాబు, డిప్యూటీ ఎంపీడీఓ పెదవలస పంచాయతీ సెక్రెటరీ కిట్లంగి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15,16,విలేఖరుల కోసం శిక్షణ తరగతులు





**ఏజెన్సీలోమొట్టమొదటిసారిగా శిక్షణ తరగతులు**

**ఏపీ యు డబ్ల్యూ జే చింతపల్లి, పాడేరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు**

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 11 :-** చింతపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 15, 16 తేదీల్లో గ్రామీణ విలేఖరుల కోసం తరగతులను నిర్వహించనున్నట్లు సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన సీనియర్ పాత్రికేయులు, అకాడమిక్ నిపుణులతో ఈ శిక్షణ తరగతులు రూపొందించామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మొదటి రోజు 15వ తేదీ ఉదయం విశాఖపట్నం నుండి వెలువడే 'లీడర్' దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి 'పరిశోధనాత్మక జర్నలిజం' అంశంపై విలేఖరులకు శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బాబీవర్ధన్ 'క్రైం వార్తల్లో జాగ్రత్తలు, రిపోర్టింగ్‌లో మెళుకువలు' అంశంపై ప్రసంగిస్తారు. అనంతరం ఎం. శ్రీనివాసరెడ్డి 'భారత రాజ్యాంగం ?- పత్రికా చట్టాలు' అంశంపై తరగతులు నిర్వహిస్తారు. రెండవ రోజు గిరిజన చట్టాలు %-% రిపోర్టింగ్ అంశంపై సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్ గంజివరపు శ్రీనివాసరావు బోధిస్తారు. ఆ తరువాత విశాలాంధ్ర ఎడిటర్ ఆర్.వి. రామారావు 'పత్రికా భాష వ్యవహారం' గురించి అవగాహన కల్పిస్తారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు విజయకుమార్ కుర్రా 'కృత్రిమ మేధ - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జర్నలిజంపై ప్రభావం' పై ప్రసంగిస్తారు. సీనియర్ జర్నలిస్ట్ డి. సోమసుందర్ 'జర్నలిజం %-% నైతిక విలువలు' అంశాన్ని వివరించనున్నారు. తరువాత ముగింపు సభలో పాల్గొన్న విలేఖరులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయబడతాయి. ఇదిలా ఉంటే, అల్లూరి జిల్లా ఏపీ యు డబ్ల్యూ జె ప్రతినిధులు చింతపల్లి, పాడేరు ప్రాంతాల ప్రెస్ క్లబ్ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుమణి శ్రీ పూజలను మర్యాదపూర్వకంగా కలిసి శిక్షణ తరగతులకు అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంలో చింతపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సతీష్, వనరాజు, దయానంద్, రాజు, రమేష్, గాంధీ, కోటి, పాడేరు ప్రెస్ క్లబ్ సభ్యులు నాగరాజు రాజేష్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి యం ఎస్ ఐ డి బోర్డు డైరెక్టర్ గా ముగడ రాజారావు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 11:**పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిసూ ఉన్నత స్థాయిలో పదవులు కేటాయిస్తూ వారిని గౌరవించడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం అధిష్టానం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ,చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డ్ డైరెక్టర్ గా విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. మరియు ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్.విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు లకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తునామని, పార్టీ తమపై ఉంచిన బాధ్యతను నమ్మకంగా పనిచేస్తానని ముగడ రాజారావు తెలియజేశారు.

# విద్యా ప్రేరణతో సమాజ అభివృద్ధి సాధ్యం కలెక్టర్ హరేంద్రప్రసాద్

## విశాఖలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ వెల్ఫేర్ డే వేడుకలు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11 :**జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీ వెల్ఫేర్ డే సందర్భంగా డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ ప్రధాన అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన చెప్పారు డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ తీసుకువచ్చిన విద్యా సంస్కరణలు దేశానికి దిశా నిర్దేశం చేశాయి. ఆయన చూపిన మార్గం లో నడిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందు తుంది. విద్యతోనే మానవ విలువలు, సమాన త్వం, సహజీవన స్ఫూర్తి బలపడతాయి అని అన్నారు.మైనారిటీల సంక్షేమానికి జిల్లా పరిపాలన చురుకుగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ వివరించారు. ఆనందపురం మండలం పీకేరు గ్రామంలో నాలుగు ఎకరాల్లో ముస్లింలకు బరియల్ గ్రౌండ్ ఏర్పాటు పూర్తయిందని, అలాగే పెందుర్తి పరిధిలో కొత్త స్థల కేటాయింపులపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మధురవాడ బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభమైనట్లు చెప్పారు.అంతేకాక, మైనారిటీ మతపెద్దల కోసం వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని, వాటిని సమాజ ప్రయోజనానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ శాఖ కార్యదర్శి మహ్మద్ నజీర్, కార్పొరేటర్ సాధిక్, టీడీపీ జిల్లా కార్యదర్శి గౌస్ మహమ్మద్, డీఎంవో సత్య పద్మ, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ సుభాని, మాజీ కార్పొరేటర్ ఎం.డి. రఫీ, మతపెద్దలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దు.





- **ఆరోగ్యంతో పాటు సమాజానికి చేటు.**
- **ఈగల్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ ఎలీషా.**

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 11:-** చింతపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం నాడు జరిగిన కార్యక్రమంలో యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడం వలన వారికి కలిగే అనర్థాలు, వారి వలన సమాజానికి కలిగే ఎన్నో దుష్పరిణామాలు సంభవించే అవకాశం ఉందని ఈగల్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ వై. ఎలీషా అన్నారు.. ఈ సమావేశంలో ముందుగా ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల నిర్వహణ లో లోపాలు గురించి, ప్రీస్కూల్ యాక్టివిటీస్ నిర్వహణ గురించి, బాల సంజీవిని మరియు పోషణ ట్రాకర్ యాప్ లలో ప్రతిరోజు విధిగా సబ్మిట్ చేయవలసిన ఆక్టివిటీస్ గురించి అంగన్వాడీలకు వివరించారు, అనంతరం ఈగల్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ వై. ఎలీషా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు (డ్రగ్స్) తీసుకోవడం వల్ల వారికి వచ్చే అనర్థాలు, అదే విధంగా మత్తు పదార్థాలకు (డ్రగ్స్) కి అలవాటు పడటం వల్ల సమాజానికి వారి వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. అనంతరం గంజాయి గురించి ఎటువంటి సమాచారం తెలిసినా 1972 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి తెలియజేయాలని, ఆ విధంగా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ జి. సౌజన్య, డీ .జయ భారతి, డి.తులసి, ఎం. లక్ష్మి, ఎస్. గౌరి, బిపిసి రమ, మండలంలోని అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# తపాలా శాఖ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ పోటీలు



**విశాఖ, నవంబర్ 11, పెన్ పవర్ :**తపాలా శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఎం.వి.పీ. కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ అరేనాలో నవంబర్ 10 నుండి జరుగుతున్న 40వ అఖిల భారత తపాలా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో దేశంలోని 14 తపాలా వలయాల నుండి ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.పురుషుల జట్టు ఈవెంట్లో, రెండవ రోజు మంగళవారం మొదటి సెమీఫైనల్లో తమిళనాడు జట్టు పశ్చిమ బెంగాల్ ను (3-2) తేడాతో ఓడించగా, రెండవ సెమీఫైనల్లో తెలంగాణ జట్టు అస్సాంపై (3-1) తేడాతో విజయం సాధించింది.మహిళల జట్టు ఈవెంట్ లో, మొదటి సెమీఫైనల్లో పశ్చిమ బెంగాల్ జట్టు ఆంధ్రప్రదేశ్ ను (3-0) తేడాతో ఓడించగా, రెండవ సెమీఫైనల్లో గుజరాత్ జట్టు తమిళనాడుపై (3%-%1) తేడాతో గెలిచింది.ఈ టోర్నమెంట్ నవంబర్ 14, 2025 వరకు కొనసాగుతుంది. ఆ రోజు ఫైనల్స్ మరియు వాలెడిక్టరీ కార్యక్రమంతో ముగియనుంది.

# విద్యా దాత అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు





* వైఎస్సార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్య క్షుడు కె.కె. రాజు,
* మహిళా విభాగం అధ్యక్షు రాలు పేడాడ రమణికుమారి నేతృత్వంలో కార్యక్రమం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11 :**భారతరత్న, మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో ఘనంగా స్మరణ కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం జిల్లా మైనార్టీ విభాగం ఆధ్వ ర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు అబ్దుల్ కలాం ఆజాద్ గారి సేవలను స్మరించారు. దేశ విద్యా వ్యవస్థకు ఆయన చేసిన కృషి అపూర్వమని, భారత జాతీయ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం విశాఖపట్నం అధ్యక్షు రాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆజాద్ భారత సమాజానికి విద్య ద్వారా వెలుగు నింపిన మహనీయులు. ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టడం నిజమైన నివాళి, అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జీవీఎంసీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యక ర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ రద్దు వరకు ఆందోళన కొనసాగుతుంది వాసుపల్లి హెచ్చరిక

* 12న ఏవీఎన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11 :**రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిం చాలనే కూటమి ప్రభుత్వ యత్నాలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మాన్ని మరింత ఉధృతం చేస్తామని విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హెచ్చ రించారు.నవంబర్ 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న నిరసన ర్యాలీలకు ముందు భాగం గా, వాసుపల్లి నేతృత్వంలో మంగళవారం ఏవీఎన్ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాల యం వరకు ట్రయల్ రన్ ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీ రెల్లివీధి మీదుగా సాగగా, మార్గ మధ్యంలో దక్షిణ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి వాసుపల్లి టీ తాగి మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"1947 నుంచి 2022 వరకు కేవలం 11 మెడికల్ కాలేజీ లు మాత్రమే ఉన్న రాష్ట్రంలో, సీ.ఎం. జగన్ ఒక్కసారిగా 17 మెడికల్ కాలేజీలను ప్రారం భించడం చరిత్రాత్మక నిర్ణయం. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ప్రజాహిత కార్యక్రమాన్ని పి.పి.పి. పేరుతో ప్రైవేటీకరించడం ప్రజలను మోసం చేయడమే, అని అన్నారు.ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య ఒక కలగానే మిగిలిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసనల్లో ప్రజలందరూ, ముఖ్యంగా యువత స్ఫూర్తిగా పాల్గొని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చారు.విశాఖ దక్షిణ ని యోజకవర్గంలో జరగనున్న 12వ తేదీ ర్యాలీకి అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్య కర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని వాసుపల్లి కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అడివిష్ణు రెడ్డి, గంగళ్ల రామరాజు, వద్దది దిలీప్, సనపల రవీంద్ర భారత్, దస్మాంతుల చిన్ని, కంటిముంచు సాగర్, పీతల వాసు, ఆకుల యెషు, మహమ్మద్ షకీల్, సువార్త రాజు, జిరు సుధా, ఆకుల శ్యామ్, సంతోష్, వేణు, శివ, దస్మాంతుల సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులు ప్రారంభం

* పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,నవంబర్ 11 :**స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం . ఈ సందర్భంగా ముఖ్య మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో సిదార్థ నగర్ కి ఆనుకొని ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల యాభై సెంట్ల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ పనులను ప్రారంభించుటకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ వొచ్చి గ్రౌండ్ లో మార్కింగ్ చేయడం జరిగిందని, పనులను త్వరగా పూర్తి చేయాలని, చేస్తున్న పనిలో నాణ్యత తగ్గకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు,కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, పావాడ రమణమూర్తి,డీవీ. సూరిబాబు, బొడ్డా సన్యాసిరావు,గండేపల్లి రాము, జాన్ రమేష్, సుందర్ సునీల్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకులు



**గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 11** మహా విశాఖ నగర పాలక సంస్థ 66వార్డ్ లో కూటమి ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధిలో భాగం సుపరిపాలన సంక్షేమం, అభివృద్ధి, ప్రజల భద్రత, ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం, వార్డు మొత్తం అటు కైలాష్ నగర్, ఇందిరా కాలనీ, సీతారామ నగర్, బీసీ రోడ్డు, అజిమాబాద్, నవాబ్ నగర్, లో ఏకధాటిగా జరుగుతున్న ఎన్నో ఏళ్లుగా శిథిలం ఐపోయిన, డ్రైన్లు, రోడ్లు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన చొరవతొ జరుగుతున్న అభివృద్ధిని దగ్గరుండి పరిశీలిస్తున్న వార్డు అధ్యక్షుడు గోమాడా వాసు, మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ భాషా, సుభాన్ భాయ్, వర్క్ ఇన్స్పెక్టర్, వర్క్ కాంట్రాక్టర్స్ తో కలిసి దగ్గరుండి పరిశీలించారు , అభివృద్ధి ఒక కూ టమి ప్రభుత్వానికే సాధ్యపడుతుంది, ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు .

## విద్యతో వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజ ప్రగతి సాధ్యమే విశాఖ ఎం.పీ భరత్






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11 :**జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విశాఖ లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు మతుకు మిల్లి శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ వేడుకలను మౌలానా అబుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఎంపీ శ్రీభరత్, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, సమాజా న్ని కూడా మారుస్తుంది అని పేర్కొన్నారు. విద్య ద్వారా సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ప్రతి విద్యార్థి తనకు లభిం చిన విద్యా అవకాశాన్ని సద్వినియోగం చేసు కుని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంపీ సూచించారు. తక్కువతో సంతృప్తి చెంద కండి. కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధి రోహించండి అని విద్యార్థులను ఉత్సాహప రిచారు.విద్య ద్వారా సాధించిన జ్ఞానాన్ని సమా జానికి తిరిగి అందించడం ప్రతి విద్యావంతుడి బాధ్యత అని భరత్ చెప్పారు. విద్యా విలువ లను ఆచరణలో పెట్టి దేశ అభివృద్ధికి తోడ్పడా లని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థు లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తీములబందలో “పొలం పిలుస్తోంది” కార్యక్రమం



**రైతులకు సూచనలు చేసిన వ్యవసాయ అధికారి**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 11:**అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలం గూడెం కొత్త వీధి సచివాలయం పరిధిలోని తీములబంద గ్రామంలో “పొలం పిలుస్తోంది” కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు ఇచ్చారు.తాజాగా తుఫాను ప్రభావంతో వరి పంటల్లో అక్కడక్కడ మానిపండు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ తెగులు నివారణకు ప్రొఫినోఫోస్ మందును సూచించిన మోతాదులో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా, వాతావరణంలో మార్పుల కారణంగా వర్షం పడే సూచనలు ఉన్నాయని, ఇప్పటికే వరి కోతలు పూర్తయిన రైతులు తమ పంటను తడవకుండా దిబ్బలు వేసి జాగ్రత్తలు తీసుకోవాలని గిరిబాబు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. సుభద్ర, గ్రామ వ్యవసాయ సహాయకురాలు మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

విశాఖలో టిడిపి ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11 :**దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని టెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం సోమవారం విశాఖపట్నంలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగింది.కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ గారు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంత రం మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ గారు భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించడంతో పాటు విద్యకు విశేష ప్రాధాన్యత ఇచ్చారు. విద్యతోనే వ్యక్తి జీవితం లో వెలుగులు నిండుతాయి, దేశ అభివృద్ధి సా ధ్యమవుతుంది అనే స్ఫూర్తిని ఆయన అందిం చారు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు మహమ్మద్ రఫీ, అబ్దుల్ చిన్న రెహమాన్, జబ్రుల్లా, షేక్ బాబ్జి, అబ్దుల్ అనీఫ్, షేక్ రహమతుల్లా, మహమ్మద్ గౌస్, సుభాని, అబ్దుల్ సలీమా, షేక్ కలిశా, అబ్దుల్ భాష, యాసీన్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్రడక్షన్ టు ఫైనాన్షియల్ ప్లానింగ్ సదస్సు నిర్వహించిన విజ్ఞాన్ కళాశాల



**కూర్మన్న పాలెం : పెన్ పవర్ ,నవంబర్ 11** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ విమెన్, విశాఖపట్నంలో నవంబర్ 11, 2025న ఇంట్రడక్షన్ టు ఫైనాన్షియల్ ప్లానింగ్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు . కార్యక్రమానికి డా. శ్రీను మాడెం, సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా , విశాఖపట్నం నుండి రిసోర్స్ పర్సన్‌గా హాజరై, ఫ్యాకల్టీ సభ్యులకు ఆర్థిక ప్రణాళిక మరియు నిర్వహణపై విలువైన సూచనలు అందించారు.

ఈ సందర్భంగా, విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ విమెన్ మరియు ఫిన్ సంజీవి ఈ డబ్లయు ఎస్ సంస్థల మధ్య ఒక సహకార ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులలో ఫైనాన్షియల్ లిటరసీ, కెరీర్ గైడెన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ రంగాలలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు వ్యక్తిగత మరియు వృత్తి పరమైన అభివృద్ధికి అవసరమైన ఆర్థిక జ్ఞానం మరియు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే వేదికను అందించనున్నారు.ఈ ఒప్పంద పత్రాలను సంస్థ ప్రతినిధి డా. శ్రీను మాడెం మరియు విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ విమెన్ ప్రిన్సిపాల్ డా. బి. అరుంధతి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# సగర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా గురం నూకరాజు

**గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 11** తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు గుర్రం నూకరాజు కి సగర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైనందుకు బీసీ నాయకులు సత్కరించారు గుర్రం నూకరాజు మాట్లాడుతు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ , గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే , టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు . కూటమి నాయకులు, కార్యకర్తలకు గుర్తించినందుకు రుణపడి ఉంటానని. తనకు ఇచ్చిన ఈ పదవి కర్తవ్యం గా నిర్వహిస్తానని ,పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తాను అని అన్నారు . నూకరాజు కి డైరెక్టర్ పదవి వచ్చినందుకు కూటమి నాయకులు, సగర నాయకులు ఈ పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. బీసీ నాయకులు, అప్పలనాయుడు, లోవబాబు,రుక్మిణి, శ్రీను,తేజ, సూరి అప్పారావు, శెట్టి బాబ్జి,గజ్జల తదితరులు పాలుగొన్నరు .



# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జనసేన నేతలు నివాళులు






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11** :జనసేన పార్టీ నగర కార్యాలయంలో భారత తొలి విద్యాశాఖామంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులు అర్పించారు.ఈ సం దర్భంగా సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారు స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా భారత విద్యా వ్యవస్థకు పునాది వేశారు. దేశంలో సమాన విద్యావకాశాల కోసం ఆయన చేసిన కృషి అపారమైంది అని పేర్కొ న్నారు.తదుపరి రెహమాన్ మాట్లాడుతూ ఆజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ సహా అనేక భాషలలో ప్రావీణ్యం సంపాదించారు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా సేవలందించారు. ఆయన విద్యా దృష్టి దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసింది" అని అన్నారు. అలాగే 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ షాదిక్ మాట్లాడుతూ ఆజాద్ విద్యను సమాజ మార్పుకు సాధనంగా మార్చారు. ఆయన ప్రేర ణతో మనం నేటి విద్యా ప్రగతిని చూస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ జనసేన ఇన్చార్జి శివ ప్రసాద్ రెడ్డి, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు రాజు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల శ్రీను, 33వ వార్డు కార్పొరేటర్ జి.కె., స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ సభ్యురాలు లక్ష్మి చౌదరి, కనీస వేతన సంఘం సభ్యురాలు తెలుగు లక్ష్మి, మహిళా కోఆర్డినేటర్ అమరాపు దుర్గ, 39వ వార్డు జనసేన నాయకురాలు కొల్లి సింహాచలం, నాయకులు దువ్వి గోవింద్తో పాటు వార్డు అధ్యక్షులు, జనసైనికులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

# గాయపడిన రమేష్‌కు సిరమ్మ చేతుల మీదు గా రూ.50 వేల ఆర్థిక సాయం



**భిమిలి, పెన్ పవర్, నవంబర్ 11** :పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన నాటు బాంబు పేలుడు ఘటనలో గాయపడిన రెడ్డి రమేష్‌కు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు చిన్న శ్రీను స్పందించారు. రమేష్ పరిస్థితి తెలుసుకున్న శ్రీనివాసరావు, తన కుమార్తె మరి. యు చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ చేతుల మీదుగా బాధిత రమేష్‌కు రూ.50,000 ఆర్థిక సాయం అందించారు.ఈ సాయం కార్య క్రమం మన్యం జిల్లా డాక్టర్ రామ్మోహన్ నాయుడు హాస్పిటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భం గా సిరమ్మ మాట్లాడుతూ, రమేష్ పరిస్థితి చూసి ఎంతో బాధపడ్డాను. అతని కి మెరుగైన వైద్యం అందేలా వైద్యులకు సూచించాం అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, సభ్యులు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల మార్ట్ లాభాల పంపిణీ




★ పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 11)** :మహిళలు ఐక్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మాకవరపాలెం మండల మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న మార్ట్ 22 నెలల్లో 14.32 లక్షల రూపాయల నికర లాభాన్ని ఆర్జించడం విశేషమని ఆయన అన్నారు.
సమాఖ్య సభ్యులకు లాభాలను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్, మొత్తం 14,320 మంది సభ్యులకు ఒక్కొక్కరికీ 100 రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్థానికంగా తయారైన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం ద్వారా మహిళా సంఘాలు సాధించిన విజయం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ పీడీ అనకాపల్లి సచిదేవి, తహశీల్దార్ రమణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# మాకవరపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్ కు శంకుస్థాపన



★ వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

★ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

★ 1500 మందికి ఉపాది

**నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 11)** :అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం యరకన్నపాలెంలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ మరియు మీడియం ఎంటర్ ప్రైజెస్) పార్కు ఏర్పాటుకు మంగళవారం అంకురార్పణ జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.
?ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంకల్పం వల్ల మన ప్రాంతం ఒక పెద్ద పారిశ్రామిక కేంద్రంగా మారేందుకు మొదటి అడుగు పడిందన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 1,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. ఉద్యోగ నియామకాల్లో తొలుత నిర్వాసితులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అదనంగా మిగిలిన వాటిలో మాకవరపాలెం మండలానికి చెందిన వారికే అవకాశాలు కల్పించాలని అధికారులకు సూచించారు.
?రాచపల్లి గ్రామం వద్ద గల 410 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తున్నారని, అందులో భాగంగా మొదటి దశలో 20 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేస్తారని స్పీకర్ వివరించారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలన్నదే ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన అని కొనియాడారు. భూములు ఇస్తున్న రైతులకు చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం అందజేస్తామని, ఎవరికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేస్తారని భరోసా ఇచ్చారు.
?ఈ ప్రాంతం గ్రామాలు, ఇళ్లకు దూరంగా ఉండటంతో పరిశ్రమలకు చాలా అనుకూలమైనదని, పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బంది కాకుండా ప్రణాళికలు రచిస్తున్నారని తెలిపారు. యలమంచిలి రైల్వే స్టేషన్‌కు ఈ ప్రాంతాన్ని మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక రోడ్డు నిర్మిస్తామని వెల్లడించారు. కాఫీ పరిశ్రమ ఏర్పాటుతో మహిళలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఇలాంటి పరిశ్రమలతో మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని, వచ్చే పరిశ్రమలను పాడుచేసుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు.
?ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరమణ, పరిశ్రమల శాఖల అధికారులు, మాకవరపాలెం తహసీల్దార్ రమణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆర్. వై. పాత్రుడు, మండల స్థాయి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో రూ.3.05 కోట్ల అభివృద్ధి పనుల కు శంకుస్థాపన ఎమ్మెల్యే గంటా



**భీమిలి, పెన్ పవర్ నవంబర్ 11** :భీమిలి నియోజకవర్గ అభివృద్ధికి మరొక ముందడుగుగా, జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గంటా శ్రీని వాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు.
నిడిగట్టు, నగరంపాలెం, కాపులుప్పాడ, జేవీ అగ్రహారం, చేపలుప్పాడ ప్రాంతాల్లో సుమారు రూ.3.05 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులను నాణ్యత ప్రమాణాల తో రాజీపడకుండా, నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
జీవీఎంసీ పరిధిలోని 1 నుంచి 8 వార్డుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.150 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతోందని ఎమ్మెల్యే వివరించారు. అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తున్నదని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఓ. అయ్యప్ప నాయుడు, కార్పొరేటర్ లోడగల అప్పారావు, పాసి నరసింగరావు, గరికిన ఎల్లాజీ (కింగ్), పాసి త్రినాథరావు, పోతిన ప్రసాద్, కొప్పల రమేష్, మొల్లి లక్ష్మణరావు, బోయి రమాదేవి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన లో టిడిపి చురుకైన పాత్ర



**గాజువాక : పెన్ పవర్ ,నవంబర్ 11** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో క్యాన్సర్ హాస్పిటల్ నుండి ఫార్మసిటీ కాలనీ వరకు ఎక్స్టెన్స్ బీటీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర , సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్ దుల్లా చల్లారావు, ఏఈ రాజ శేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్ పెంటారావు సానిటరీ ఇన్స్పెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డికొండ-2లో సర్పంచ్ చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా,గూడెం కొత్త వీధి మండలం దొడ్డికొండ-2 గ్రామ ప్రజలకు గత ఐదు రోజులుగా తీవ్రమైన మంచినీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామంలోని బోర్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్ ప్యానెల్ బోర్డు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.ఈ విషయాన్ని స్థానిక పేసా కార్యదర్శి మాదిరి చంటిబాబు మరియు గ్రామస్తులు సర్పంచ్ కుందేరి రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్, కొత్త ప్యానెల్ బోర్డును ఏర్పాటు చేయించి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.సర్పంచ్ వేగవంతమైన చర్యకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు సాగిన రాజేష్,జూర్రా రమణ బాబు, మర్రి కృష్ణ, మర్రి జడ్సన్, మర్రి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ప్రభుత్వం బాధితులకు

**సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందజేసిన ఎం.పీ.భరత్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 11:**విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్ మంగళవారం తన కార్యాలయం లో ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ముక్కా శ్రీనుకు రూ.1,21,329, సింగామాపల్లి గ్రామానికి చెందిన మరో బాధితుడికి రూ.50, 000 విలువైన చెక్కులను ఎం.పీ.భరత్ అందిం చారు.ఈ సందర్భంలో ఎం.పీ.భరత్ మాట్లాడు తూ, ప్రజల ఆపదలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కష్టాల్లో ఉన్న కుటుంబా లకు ఆర్థిక బలాన్ని అందించడం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి నిదర్శనం అని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎం.పీ.భరత్ హామీ ఇచ్చారు.

# శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు

* గంజాయి అక్రమ రవాణా పై ఉక్కు పాదం
* ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి
* గూడెం కొత్త వీధి సీఐ బొడ్డేపల్లి సుధాకర్

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 11:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బొడ్డేపల్లి సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకు సీఐగా పనిచేసిన వరప్రసాద్ విశాఖ జిల్లాకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. విజయనగరం డిసిఆర్బీలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సుధాకర్‌ను గూడెం కొత్త వీధి సీఐగా నియమిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు మంగళవారం సుధాకర్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ సురేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూడెం కొత్త వీధి మండలంలోని మారుమూల ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఐ బొడ్డేపల్లి సుధాకర్ అన్నారు. ప్రస్తుతం అల్లూరి ఏజెన్సీలో గంజాయి అక్రమ రవాణా అధికంగా సాగుతుందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ రవాణాను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తానని అన్నారు మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గిరిజనులు గంజాయి వంటి పంటలు మాని సాంప్రదాయ పంటలపై దృష్టి సారించే విధంగా చర్యలు చేపడుతామని ఏమైనా ప్రజా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలవవచ్చునని వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకొని పరిష్కరిస్తామని సీఐ సుధాకర్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్ని పాఠశాలల్లోనూ గిరిజన యువతను మేల్కొల్పే విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సీఐ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ పాల్గొన్నారు.




# అమ్మవారి దర్శనంతో 38వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

* స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి హామీ





**విశాఖ దక్షిణం,పెన్ పవర్, నవంబర్ 11 :**దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివా స్ మంగళవారం 38వ వార్డులో పర్యటించారు. భూలోకమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భూలోకమ్మ, పోలేరమ్మ, పోతురాజు గార్ల పండుగ సందర్భంగా అమ్మవా ర్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మ వారి దర్శనం చాలా ఆనందంగా ఉంది. ఆలయ అభివృద్ధి, గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ మా సహకారం ఉంటుంది అని అన్నారు. తదుపరి ఎమ్మెల్యే బుక్క వారి వీధి, పెద్ద కాలువ, భూలో కమ్మ వీధి ప్రాంతాల్లో పర్యటిస్తూ రోడ్డు మర మ్మతులు, డ్రైనేజీ, శానిటేషన్ తదితర అంశా లపై స్థానిక ప్రజలతో మాట్లాడారు. వార్డు పరిధి లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని స్థానిక ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ సమీంతో సమీక్షించి, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో వార్డు కార్పొరేటర్ నరసింహాచారి దంపతులు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి తూర్పు సమన్వయకర్త రవి రాజు జన్మదిన వేడుక



**విశాఖ తూర్పు,పెన్ పవర్,నవంబరు 11:** బిజెపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త,ఉత్తరాంధ్ర టూరిస్ట్ ట్రావెల్స్ బస్సు ఉపాధ్యక్షులు రవిరాజు జన్మదిన వేడుకలు ఎస్ కె ఎస్ ట్రావెల్స్ కృష్ణ చౌదరి,కె కె రాజు,ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వృద్ధులకు మరియు చిన్న పిల్లలకు అయ్యప్ప భక్తులకు ఫలహారం,బోజన కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రజా ఉద్యమం జరిగి తీరుతుంది

* తరలి రావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
* అనుమతులు లేవంటూ పోలీసుల నోటిసు
* జరిపి తీరుతామంటున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



**నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 11) :**రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12వ తేదీన ప్రజా ఉద్యమం పేరిట ఆందోళనలు నిర్వహించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ పిలుపు మేరకు నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఎలాంటి ర్యాలీలకు, బహిరంగ సభలకు అనుమతులు లేవని పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంలో ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాన్ని పోలీసుల సహకారంతో నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఈ ర్యాలీ జరిగి తీరుతుందన్నారు. పోలీసుల హెచ్చరికలు పట్టించుకోవద్దని మన ప్రాంతానికి అన్యాయం జరుగుతున్నప్పుడు గొంతెత్తి ప్రశ్నించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనుకోవడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకునే వరకు పోరాటం జరుగుతుందన్నారు. పోలీసులు ఎలాంటి ఆటంకాలు సృష్టించినా నిర్ణీత సమయానికి ర్యాలీ జరిగే ప్రాంతానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

# జీవీఎంసీ అధికారులపై దాడిలో పెందుర్తి పోలీసుల నిర్లక్ష్యం!





* ఈ కేసులో రాజకీయ అండదండలు..?
* జీవీఎంసీ ప్లానింగ్ అధికారుల ఆవేదన..!
* ప్లానింగ్ సెక్రెటరీల నిజాయితీకి తగిన గౌరవం ఎక్కడ..?

**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 11 :** జీవీఎంసీ (గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్) అధికారులపై బ్లేడుతో దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.
నగర శుభ్రత, నిర్మాణ నియంత్రణ, పట్టణ ప్రణాళిక వంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు ఇలాంటి దాడికి గురవడం పౌర సమాజం ముందుకు ఒక ప్రశ్నను తెచ్చింది. “నిజాయితీగా పనిచేసే అధికారులకు రక్షణ ఎక్కడ?” ఏం జరిగిందంటే.. జోన్ 8, జీవీఎంసీ, 93వ వార్డు, ప్రహ్లాదపురం పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే సమయంలో ఒక నిర్మాణదారుడు జీవీఎంసీ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులపై బ్లేడుతో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై జీవీఎంసీ సిబ్బంది పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆశ్చర్యకరంగా, పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, “విచారణ చేసి 15 రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం” అని చెప్పడం మరింత చర్చకు దారితీసింది.

**పెందుర్తి పోలీస్ స్టేషన్ సీఐ నిర్లక్ష్యం..?**

చట్టప్రకారం ప్రభుత్వ అధికారులపై దాడి జరిగితే, అది నాన్-బెయిలబుల్ నేరం కింద వస్తుంది. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం అనేది పోలీసుల బాధ్యత. కానీ ఈ ఘటనలో పెందుర్తి పోలీసులు “విచారణ తర్వాత” అనే ఆలస్యం చేయడం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గినట్లు ప్రజలు అనుమానిస్తున్నారు.

**ఈ కేసులో రాజకీయ అండదండలు..?**


స్థానికంగా ఆ నిర్మాణదారుడు కొన్ని రాజకీయ నేతల మద్దతుతో ఉన్నాడనే ప్రచారం వినిపిస్తోంది. ఆ మద్దతు వల్లే కేసు నమోదు ఆలస్యం అవుతోందా అనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి సందర్భాల్లో ప్రజాసేవకులు న్యాయం కోసం తలదించుకోవాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోంది.

**జీవీఎంసీ ప్లానింగ్ అధికారుల ఆవేదన..**

ప్లానింగ్ విభాగం సిబ్బంది తమ ఆవేదన వ్యక్తం చేస్తూ మేము చట్టప్రకారం పనిచేస్తే మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తున్నారు. అధికారులు సురక్షితంగా పనిచేయలేకపోతే, పట్టణాభివృద్ధి ఎలా సాధ్యం?” అని ప్రశ్నించారు.

**ప్లానింగ్ సెక్రెటరీల నిజాయితీకి తగిన గౌరవం ఎక్కడ..?**

ఈ ఘటన మరోసారి “నిజాయితీగా పనిచేసేవారే బలవంతులమా?” అనే ప్రశ్నను మళ్లీ ప్రస్తుతపరిచింది. నియమ నిబంధనలు పాటించే అధికారులు, సిబ్బంది కంటే అక్రమాలు చేసే వ్యక్తులకు వ్యవస్థలో ఎక్కువ రక్షణ ఉందా అనే అనుమానం ప్రజల్లో పెరుగుతోంది. నగర శాసనబద్ధతను కాపాడేందుకు ముందుకు వచ్చే అధికారులపై దాడులు చేయడం, పోలీసుల ఆలస్యం చేయడం %-% ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే అంశాలు.
తక్షణమే విచారణ పూర్తి చేసి, దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సమాజం డిమాండ్ చేస్తోంది.



# బురదమయంగా తయారైన రోడ్డును బాగు చేసుకుంటున్న గుర్రాలగొంది గ్రామస్తులు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,నవంబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండలం, రింతాడ పంచాయతీ పరిధిలోని గుర్రాలగొంది గ్రామస్తులు తమ గ్రామానికి వెళ్లే రహదారి దయనీయ స్థితిలో ఉండటంతో స్వయంగా రోడ్డుపనులు చేపట్టారు. గ్రామానికి ఉన్న మట్టి రహదారి బురదమయం కావడంతో గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు వార్డు సభ్యుడు గెమ్మెల పాల్స్ ఆధ్వర్యంలో మంగళవారం రహదారిపై రాళ్లు వేసి, మట్టితో పూడ్చి రహదారిని సవ్యంగా మార్చుకున్నారు. అటు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చన్న ఆందోళనతో, గ్రామస్తులు రాత్రివేళే రోడ్డుపనులు నిర్వహించారు. గ్రామస్థుల ఈ సామూహిక కృషి గ్రామ అభివృద్ధిపై వారి నిబద్ధతను ప్రతిబింబిస్తోందని స్థానికులు అభినందించారు.

# పర్యాటక ప్రాంతంలో గట్టి నిఘా.




సి. ఐ. హిమగిరి.

**అరకులోయ పెన్ పవర్ 11 :**అరఅరకులోయ డిగ్రీ కాలేజీలో ఈగల్ టీం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో గంజాయి వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎవరు గంజాయి జోలికి నాటసార జోలికి పోవద్దని మంచిగా ఆరోగ్యంగా దృష్టి పెట్టి మంచిగా చదువు చదవాలని వీటికి గంజాయి రవాణాకు పాల్పడిన గంజాయి కేసుకు ఇన్వాల్ అయినా 20 సంవత్సరాలు కఠిన జైలు శిక్ష జర్మనా ఉంటుంది లైఫ్ అంతా స్టైల్ అయి పోతుందనీ గంజాయి జోలికి వెళ్లవద్దని తెలియజేశారు. ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో అరకులోయ సీఐ ఎల్ హిమగిరి అరకు ఎస్సై గోపాలరావు అరకులోయలో పటిష్ట భద్రత అరకు టూరిస్ట్ ప్లేసులో అన్నిటికీ పోలీస్ చెక్ చేస్తున్నారు. అరకు రైల్వే స్టేషన్ బస్ స్టేషన్ పద్మాపురం గార్డెన్ ట్రైబల్ మ్యూజియం కాఫీ మ్యూజియం సుంకరమెట్ట వుడెన్ బ్రిడ్జి అన్నిటిలో పటిష్ట భద్రాతను సెక్యూరిటీ ఉంచి ప్రజలు ఎవరు మీదైనా అనుమానాలు కలిగిన అనుమానతులు తిరిగిన అనుమానం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఎల్ హిమగిరి ఎస్సై గోపాల్ రావు ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రమాణ స్వీకారం





- సమాజాభివృద్ధి పట్ల జిల్లా నాయి బ్రాహ్మణ కొత్త వేదిక
- కొత్త నాయకత్వం బాధ్యతలు స్వీకరణ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 11 :** విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం (రి.నెం.500/82) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం కరాస దుర్గాలమ్మ, బంగారమ్మ గుడి వద్ద ఉన్న శ్రీ దుర్గా వేమన సంక్షేమ భవనం కళ్యాణ మండపంలో సుమారు వెయ్యి మందికి పైగా సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం నాయి బ్రాహ్మణ సమాజ ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. కొత్త నాయకత్వం ద్వారా సమాజంలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

### కొత్త నాయకత్వం బాధ్యతలు స్వీకరణ

గౌరవ అధ్యక్షులుగా ముసిడిపల్లి రమణ, అధ్యక్షులుగా కోడూరు గణపతి రావు, ప్రధాన కార్యదర్శిగా నరవ పైడిరాజు, అధికార ప్రతినిధిగా బలంకి వెంకటరావు, మహిళా అధ్యక్షురాలిగా కళావతి, వర్కింగ్ అధ్యక్షుడిగా చింతపల్లి సూర్య, యువజన అధ్యక్షుడిగా చింతపల్లి సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. అదనంగా నియోజకవర్గ ఇన్చార్జీలుగా గోల్కొండ కర్ణాకర్, బైలపూడి సన్యాసిరావు, టెలిగ్రాఫ్ సుందరరావు, కోరాడ సన్యాసిరావు, కూర్మాపు ప్రసాద్ వంటి నాయకులు నియమితులయ్యారు.

### ప్రజాప్రతినిధుల హామీలు, ఆశాభావం

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, "నాయి బ్రాహ్మణులు సమాజంలో కష్టపడే వర్గం. వారి అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వరపు రామారావు మాట్లాడుతూ, సమాజానికి ప్రభుత్వ సహకారం అందించే దిశగా తాను కృషి చేస్తానని తెలిపారు. విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశు రామరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బీసీలను గౌరవప్రదమైన స్థానాల్లో నిలబెడుతోందని, భవిష్యత్తులో దేవాలయ పాలక మండలాల్లో నాయి బ్రాహ్మణులు మరిన్ని బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఇచ్చిన సబ్సిడీలు (సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్) వంటి చర్యలు సమాజానికి మేలు చేస్తాయని అన్నారు.

### సమాజ ప్రగతికి సంఘం వేదికగా

కార్యక్రమంలో పారిశ్రామికవేత్త డీజేటి సంజయ్ కుమార్, డీఎస్పీ పీ.ఏ. నాయుడు, శెట్టిబలిజి కార్పొరేషన్ డైరెక్టర్ అనసూయ మధుసూదన్ రావు, వ్యాపారవేత్త హరికృష్ణ రాజు, బీజేపీ నాయకులు కాళ్ళ ఆదిబాబు, వడ్లపూడి ఈశ్వరరావు, కనితి అప్పలరాజు, ఆరిపాక రమణ, పుల్లేటికుర్తి సూర్యారావు, మల్లువలస వర్మ, బైవరపు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు నాయి బ్రాహ్మణ సేవా సంఘం భవిష్యత్తులో విద్య, ఉపాధి, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ మహోత్సవం కేవలం ప్రమాణ స్వీకార కార్యక్రమమే కాదుబీ ఇది నాయి బ్రాహ్మణ సమాజం రాజకీయ, సామాజికంగా మళ్ళీ చైతన్యం చెందుతున్న సంకేతం. ప్రభుత్వాలు బీసీల పట్ల చూపుతున్న దృష్టి, సబ్సిడీలు, మరియు పాలక మండలి స్థానాల ద్వారా సమాజానికి ఉన్న అవకాశాలను ఈ సభలో పలువురు నాయకులు స్పష్టం చేశారు. విశాఖ జిల్లాలో సామాజిక సమానత్వం, వృత్తి గౌరవం, మరియు సంఘటిత శక్తి పెంపు కోసం ఇది ఒక కొత్త ఆరంభం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆధ్యాత్మికతతో రాజకీయ ఏకమైకతకు కొత్త రూపు





- ఎమ్మెల్యే గణబాబు కుటుంబ సభ్యుల పవిత్ర పాదయాత్ర
- కూటమి నేతల సమక్షంలో భక్తి వైభవం
- రాజకీయ సారాంశం వెనుక ఆధ్యాత్మిక సంకేతం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 11 :** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ గణబాబు మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి గృహం నుండి సింహాచలం శ్రీ సింహాద్రి అప్పన్న స్వామి ఆలయానికి కాలి నడకన చేరుకున్నారు. ఆధ్యాత్మికతతో నిండిన ఈ పవిత్ర పాదయాత్రలో రాజకీయ రంగు కూడా కలిసిపోవడంతో, విశాఖ ప్రజల్లో విస్తృత చర్చకు దారితీసింది. యాత్రా మార్గమంతా స్థానిక భక్తజనాలు, కూటమి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని గణబాబు కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. సింహాచల దేవస్థానానికి చేరుకున్న అనంతరం దేవస్థాన అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గణబాబు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కూటమి నేతల సమక్షంలో భక్తి వైభవం..

ఈ సందర్భంగా కూటమి నేతలు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, పీల గోవింద్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు, జనసేన ఇంచార్జ్ అంగ దుర్గా ప్రశాంతి తదితరులు పాల్గొనడం ఈ పాదయాత్రకు రాజకీయ ప్రాధాన్యతను తీసుకొచ్చింది. భక్తి వాతావరణం నిండిన ఆలయ ప్రాంగణంలో నేతల సమక్షం కూటమి ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.





### రాజకీయ సారాంశం వెనుక ఆధ్యాత్మిక సంకేతం

గణబాబు చేపట్టిన ఈ పాదయాత్రను కేవలం ఆధ్యాత్మిక యాత్రగా మాత్రమే కాకుండా, కూటమి ఏకమైకతకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు అర్థం చేసుకుంటున్నారు.

సింహాచలం ఆలయంలో నేతలు ఒకే వేదికపై దర్శనానికి రావడం, భవిష్యత్తు రాజకీయ దిశలో కూటమి సమన్వయానికి బలాన్నిచ్చే పరిణామంగా పరిగణించబడుతోంది. భక్తి పూర్వకంగా సాగిన ఈ యాత్ర ప్రజల్లో గణబాబు పట్ల ఉన్న అభిమానాన్ని కూడా ప్రతిబింబించింది. స్థానిక భక్తులు "గణబాబు కుటుంబం భక్తి, వినయం, ప్రజాసేవకు ప్రతీక" అని అభిప్రాయపడ్డారు. ఈ పాదయాత్ర ద్వారా గణబాబు రాజకీయ సౌహార్ద్రానికి భక్తి బాటను వేదికగా మార్చినట్టు కనిపిస్తోంది.

భక్తి వైభవం మధ్య కూటమి నేతల సమిష్టి పాల్గొనడం, సమైక్యతకు, ప్రజలతో అనుబంధానికి సూచనగా నిలిచింది.

సింహాచలం పాదయాత్ర, ఆధ్యాత్మికతలో మునిగిన రాజకీయ సద్భావానికి సంకేతమైందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

# వర్చువల్‌గా ప్రారంభమైన ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్





- విశాఖలో క్రొత్తగా రూ.15 కోట్లు రూ.20 లక్షల వ్యయంతో అమలు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 11 :** మంగళవారం అనగా ఈరోజు 11:25 గంటలకు 30వ సిఐఐ (సిఐఐ) పార్టనర్షిప్ సమ్మిట్ 2025లో భాగంగా, ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ప్రారంభం చేయబడింది. ఈ సందర్భంగా విశాఖ నియోజకవర్గం, గోపాలపట్నం, వెంకటాపురంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మరియు క్లస్టర్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్‌ను కలిపి క్రొత్తగా రూ.15 కోట్లు రూ.20 లక్షల వ్యయంతో అమలు చేయబడుతోంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని, రాష్ట్రంలో పరిశ్రమలు మరియు ఉపాధి సృష్టి కార్యక్రమాల ప్రాధాన్యతను హైలైట్ చేశారు.

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ అనేది సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ప్రత్యేకంగా రూపొందించబడిన మోడల్. సిటీ లిమిట్స్ లో ఎంఎస్ఎంఈ పార్క్ కోసం గవర్నమెంట్ భూవిలేకపోవడం కారణంగా, చిన్న ఇండస్ట్రియల్ యూనిట్లను తక్కువ రెంటు రేట్లతో అందించడానికి ఈ ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయబడింది. ఇక్కడ మొత్తం 23 వర్క్‌షాప్ ఎంటర్ప్రైజెస్ ప్రారంభించగలవు. భవిష్యత్తులో మూడు నెలల్లో, వీలైనంత వేగంగా పరిశ్రమలను విస్తరించడానికి ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు.

క్రియాశీల కార్యక్రమంలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ సింహాచలం, డిప్యూటీ ఇంజనీరింగ్ డిప్యూటీ కిషోర్, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వార్డు ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు, మరియు వార్డ్ ప్రెసిడెంట్ కంపరా ఆనంద్ పాల్గొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు స్థిరమైన వసతులు కల్పించడం, ఉపాధి అవకాశాలను పెంచడం, మరియు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి దోహదం చేయడం లక్ష్యంగా ఉంచబడింది. స్థానిక వ్యాపారులు మరియు ఎంఎస్ఎంఈ ఎంటర్ప్రైజెస్ కి ఇది ఒక కొత్త అవకాశాన్ని అందిస్తుంది.

# పేదలను ఆదుకోవడలో కూటమి ప్రభుత్వానికి సాటి లేరెవ్వరు..

- కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే %డ% ప్రభుత్వ విప్,తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 11.పెన్ పవర్.** పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ %డ% కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు.గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సోమవారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నిధులు అందించడం జరుగుతుందని అన్నారు.గుమ్మలక్ష్మీపురం మండలం,ఎల్విన్ పేట కు చెందిన పత్తిక అశ్విని కుమారి కి 43,119/- రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.చెక్కు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు శ్తోయక జగదీశ్వరి గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు,మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాద్ రావు,నాయకులు తోయక కామేష్,జయంత్, సొనేల రామారావు,అప్పలస్వామి,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణాపురం 'ఈకో టూరిజం' కేంద్రం పర్యాటకులు సిద్ధం

- వనభోజనాలకు, ట్రెక్కింగ్‌కు అద్భుత ప్రదేశం
- చింతపల్లి డివిజనల్ అటవీ అధికారి నరసింహారావు





**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 11 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన పర్యావరణ పర్యాటక కార్యక్రమం(ఎకో టూరిజం ద్వారా చింతపల్లి డివిజన్ లోని కృష్ణాపురం అరణ్య ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకున్నామని చింతపల్లి డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్ఓ) వై.వీ. నరసింహారావు అన్నారు. మంగళవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీశాఖ వన్యప్రాణుల సంరక్షణ, సహజ వారసత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఎకో టూరిజంను చురుకుగా అభివృద్ధి చేస్తోందనీ, దీని ముఖ్య లక్ష్యం పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం, స్థానిక కమ్యూనిటీలకు సుస్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడమేనన్నారు. అదేకోవలో ఆంధ్ర కాశ్మీర్ లంబసింగికి సుదూర ప్రాంతంలో ఉన్న కృష్ణాపురం గ్రామంలోని పైన్స్ ప్లాంటేషన్ వద్ద ఎకో టూరిజం కేంద్రాన్ని పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రస్తుతం మన్యం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో పర్యాటకులు ఈ ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఆసక్తి చూపుతుంటారని, ప్రకృతి ఆరాధకులకు ఇది చక్కటి అవకాశమని అన్నారు. ఇక్కడ క్యాంపింగ్, ట్రెక్కింగ్, ఫైర్ క్యాంప్, అడ్వెంచర్ గేమ్స్ వంటి సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. అంతేకాకుండా కార్తీక మాసం నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలకు ఇది అనువైన ప్రదేశమని తెలిపారు. అదే క్రమంలో చింతపల్లి పశుసంవర్ధక శాఖకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది తమ కృష్ణాపురం ఎకో టూరిజం కేంద్రం ఈటీఐలో మొదటిసారి వనభోజనాలను నిర్వహించుకోవడం సంతోషం కలిగించిందని, ఆహ్లాదకర వాతావరణాన్ని వారంతా ఆస్వాదించామని చెప్పడంఆనందదాయకమన్నారు. రాబోయే రోజుల్లో ఎకో టూరిజం మరింత అభివృద్ధి చేసేందుకు పర్యాటకులు సహకరించాలని కోరారు. ఆసక్తి కలిగిన పర్యాటకులు, ఔత్సాహికులు చింతపల్లి డివిజన్ కృష్ణాపురం ఎకో టూరిజం తప్పక విచ్చేసి ప్రకృతి అందాలను ఇక్కడ వాతావరణాన్ని తిలకించి ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి బి అప్పారావు, సెక్షన్ అధికారి ఎస్ వెంకటరావు, బీట్ అధికారి ఎం వెంకటరావు పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారి దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారి శ్రీనివాస్ కుటుంబం





**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 11 :** ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలోని ప్రఖ్యాత శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయానికి ఆదాయపు పన్ను-1 (ఇన్కమ్ టాక్స్ -1) ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి బి. శ్రీనివాస్ మరియు వారి సతీమణి, కుటుంబ సభ్యులతో ప్రత్యేక దర్శనానికి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న వెంటనే, ఆలయ అధికారులు మరియు పరివేక్షణ అధికారి బి.సత్య శ్రీనివాస్ వారిని ప్రత్యేకంగా స్వాగతించారు. ఆలయ పరిసరాల్లో మర్యాదా పూర్వకంగా ఆతిథ్యంగా వ్యవహరిస్తూ, వారిని స్వామివారి దివ్య దర్శనానికి తీసుకెళ్ళారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వామివారి మూలవిరాట్టును నమస్కరించి దివ్య దర్శనం పొందారు. అనంతరం, ఆలయ వేద పండితులు వారు కోసం ప్రత్యేక వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాలు అందించటం ద్వారా, వారిని ఆలయ అధికారులు సన్మానించారు.

## అనకాపల్లి జిల్లాలో భద్రతా చర్యలు మరింత కఠినం

* జిల్లా పోలీస్ అధికారులు అప్రమత్తం





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 11 :** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల సంభవించిన పేలుడు ఘటనను దృష్టిలో ఉంచుకుని, అనకాపల్లి జిల్లా పోలీస్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అందరు అధికారులను జాగ్రత్తగా ఉండమని, అనుమానాస్పద కదలికలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆదేశించారు.

విశాఖపట్నం ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా, ముఖ్యంగా విశాఖపట్నం దిశగా వెళ్తున్న వాహనాలను పరవాడ, సబ్బవరం చెక్‌పోస్టులు వద్ద పూర్తిగా తనిఖీ చేయాలని ఎస్పీ సూచించారు. అదనంగా, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, ప్రధాన కూడళు వంటి ప్రాధాన్యత గల ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని స్పష్టంగా కనిపించే విధంగా కట్టుబడి తనిఖీలు నిర్వహించమని ఆదేశించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది మరియు స్థానిక పోలీసులు సమన్వయం చేస్తూ, సమాచార సేకరణను వేగవంతం చేయాలని ఎస్పీ సూచించారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేస్తూ..ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వస్తువులు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి. మీ సహకారం ద్వారానే మన జిల్లా సురక్షితంగా ఉంటుందని కోరారు.

# సింహాచలం దేవస్థానంలో భద్రతా శిక్షణా కార్యక్రమం






**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 11 :** సింహాచలం దేవస్థానం ఒక ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రం. ఇలాంటి ప్రసిద్ధి దేవస్థానాలు ఉగ్రవాదుల లక్ష్యంగా మారే ప్రమాదం అధికంగా ఉంటుంది. ఈ సందర్భంలో, ఆక్టోపస్ (ఉగ్రవాద నిరోధక దళం), స్థానిక పోలీసు, భద్రతా సిబ్బంది, వైద్య సిబ్బంది మరియు అగ్నిమాపక దళంతో కలిసి మాక్ డ్రిల్ చేయడం, భవిష్యత్తులో ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే సమర్థవంతంగా స్పందించడానికి సిద్ధంగా ఉండటానికి ఒక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఉగ్రవాదుల దాడులు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర అనూహ్య ఘటనలు జరిగినప్పుడు, స్థానిక విభాగాలు తక్షణంగా, సమన్వయంతో స్పందించే విధానాన్ని తెలిపారు. సమన్వయం మరియు బాధ్యతలు ప్రతి విభాగం తమ కర్తవ్యాలు, భద్రతా విధానాలు, భక్తుల నిర్ధారణ మరియు ప్రాణ నష్టం నివారణలో భాగస్వామ్యం అవ్వాలన్నారు.

**ప్రాధాన్యతలు:**

ప్రాణ నష్టం, భక్తుల భద్రత, ఆస్తి రక్షణ క్రమంలో కీలకమైన చర్యలను ముందుగా ప్లాన్ చేయడం. మాక్ డ్రిల్ ప్రాముఖ్యత. అతి క్లిష్ట పరిస్థితుల్లో సిబ్బంది తక్షణ నిర్ణయాలు, సమన్వయ చర్యలు, అప్రమత్తత స్థాయి పెంపు, అత్యవసర వైద్య సేవల సమన్వయం వంటి అంశాలలో ప్రాక్టికల్ అనుభవం పొందారు.

**భద్రతా వ్యూహాల విశ్లేషణ:**

ఆక్టోపస్ మరియు పోలీస్ సమన్వయంతో ఈ సమావేశం ద్వారా భద్రతా విభాగాల మధ్య నిరంతర ఇన్ఫర్మేషన్ షేరింగ్ మరియు ఫాస్ట్ రియాక్షన్ వ్యవస్థను స్థాపించడం సాధ్యం.

**అప్రమత్తత మరియు శిక్షణ:**

మాక్ డ్రిల్ సిబ్బందిని మాత్రమే కాకుండా, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, సివిల్ అథారిటీలను కూడా సమన్వయ పరిచే విధానం, యథార్థ పరిస్థితులను అందిస్తుంది.

**ప్రణాళిక ప్రామాణికత:**

భద్రతా ప్రోటోకాల్, ఎమర్జెన్సీ రూట్‌లు, ప్రాణ రక్షణ విధానాలు ఇప్పటికే ప్లాన్ చేయబడి ఉండడం, అత్యవసర సమయంలో మినిమం లోసెస్ ను నిర్ధారిస్తుంది.

**భవిష్యత్తు సిద్ధత:**

ఈ రకమైన శిక్షణలు, రియల్ టైమ్ ఎమర్జెన్సీ సెనారియోలను ప్రాక్టీస్ చేయడం ద్వారా భవిష్యత్తులో అనూహ్య సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం దేవస్థానం సిద్ధంగా ఉంటుంది.

**సమగ్ర విశ్లేషణ:**


ప్రసిద్ధి దేవాలయాలు అత్యవసర పరిస్థితులలో లక్ష్యం కావడం సాధారణం. అలాంటి సందర్భాలను ముందే ప్రాక్టీస్ చేయడం, భక్తుల భద్రత, ఆస్తి రక్షణకు కీలకంగా ఉంటుంది. భద్రతా సిబ్బందికి తక్షణ, సమన్వయవంతమైన స్పందన శక్తిని పెంచడం, విభాగాల మధ్య కమ్యూనికేషన్ మెరుగుపరచడం. దీర్ఘకాలంలో, ఇలాంటి శిక్షణలు భద్రతా వ్యవస్థలో ఒక సహజ, నిరంతర భద్రతా మోడల్ ను స్థాపించగలవు, ముఖ్యంగా ప్రసిద్ధి దేవస్థానాలకు. ఈ సమావేశం భద్రతా అవగాహన పెంపు, విభాగాల సమన్వయం, ప్రాక్టికల్ రెడినెస్ మరియు భక్తుల రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకున్న ఒక సమగ్ర భద్రతా వ్యూహం అన్నారు.



# సింహాచలంలో శ్రీ స్వామివారి దర్శనానికి ప్రముఖ శాసనసభ్యులు









**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 11 :** భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం పరంపరతో ప్రసిద్ధి చెందిన శ్రీ సింహాద్రి అప్పన్నగా ప్రసిద్ధి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సింహాచల క్షేత్రంలో ఈ రోజు ప్రముఖ ప్రజా ప్రతినిధులు, శాసన సభ్యులు ఘనంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ విప్ గణబాబు దంపతులు, పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేశ్ బాబు, మాడుగుల నియోజకవర్గ శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పుల వెలమ చైర్మన్ పి.వి.జి. కుమార్ స్వామివారి సేవలో పాల్గొన్నారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి సుజాత, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, మరియు పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వరరావు వీరిని సాదరంగా ఆహ్వానించారు. ప్రముఖులు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసి, అనంతరం స్వామివారి దర్శనం చేశారు. వీరికి వేద పండితులచే వేదాశీర్వచనం ప్రసాదించడం జరిగింది. ఆలయ పరంపర ప్రకారం, శ్రద్ధాభిమానుల కోసం ప్రత్యేకంగా ప్రసాదాలు అందజేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పిసిని వరాహ నరసింహం, బల్ల శ్రీనివాసరావు, మధు తదితరులు కూడా పాల్గొన్నారు, భక్తులలో ఉల్లాసాన్ని సృష్టించారు. ఈ విధమైన దర్శనాలు కేవలం భక్తి కార్యక్రమం మాత్రమే కాకుండా, రాజకీయ నేతలు మరియు సామాజిక నాయకులు స్థానిక ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచుకునే అవకాశంగా కూడా మారాయి. మంత్రివర్గ, శాసన



సభ్యుల హాజరు ఆలయ పరంపరల ప్రాముఖ్యతను మరింత పెంచుతూ, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వం పరిరక్షణలో వారి పాత్రను ప్రదర్శిస్తుంది.

# అధిక ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి

* సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలపై జిజిహెచ్ స్పెషల్ ఆఫీసర్ స్పందించాలి



**కాకినాడ, పెన్ పవర్,నవంబర్ 11:**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ (ఏ ఐ టి యు సి అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ తమ జీతాల పెంపు, హక్కుల పరిరక్షణ కోసం రెండవ రోజు నిరసన ధర్నా కొనసాగించారు.ఈ ధర్నా కార్యక్రమం యూనియన్ అధ్యక్షుడు కె.వి. రామయ్య అధ్యక్షతన మంగళవారం ఆసుపత్రి మూడో గేటు వద్ద జరిగింది.ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ గౌరవాధ్యక్షుడు తోకల ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం రోజురోజుకీ పెంచుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పన, మరియు కాంట్రాక్ట్ ఒప్పందంలోని జీవో 138 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.ప్రసాద్ మాట్లాడుతూ "సెక్యూరిటీ గార్డ్స్ చాలీచాలని జీతాలతో పని ఒత్తిడి భారాన్ని భరిస్తున్నారు. వారి శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయం. కనీస వేతనం, క్యాజువల్ లీవ్స్, జాతీయ పండుగ సెలవులు, మహిళా కార్మికులకు చీర కుట్టుకూలీ లాంటి న్యాయమైన హక్కులను వెంటనే అమలు చేయాలి," అని అన్నారు.ఆసుపత్రి సూపరిండెంట్ ఇచ్చిన హామీ మేరకు ఎంవోయూ ఒప్పందంలోని నియమ నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి స్పెషల్ ఆఫీసర్ వెంటనే స్పందించి సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ ద్వారా జీతాల పెంపునకు చొరవ చూపాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్. అనిల్ కుమార్, ఎం. రాజేంద్రరావు, దేగల మధు, పితాని రమణ, శ్రీవల్లి, మీరాభి, అప్పారావు, వెంకటేష్, లోవ కుమారి, కాటూరి రాజు, దుర్గామణి, అప్పన్న శ్రీనివాస్, శ్రీదేవి, ప్రశాంతి, రమేష్, పద్మావతి, లక్ష్మీ, పైడ్రాజు, రత్నం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణ చాలా అవసరం-జొన్నలగడ్డ రాంబాబు





**గోపాలపురం,పెన్ పవర్ నవంబర్ 11:**ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,
ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానవతా మండల చైర్మన్ రాంబాబు అన్నారు.మండలంలోని చిట్యాల గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు.ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రి సహకారంతో ఏర్పడి చేసిన ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాజా మనోహర్,ఏఎస్సై జోడాల వెంకట,సీఆర్పీ కొయ్య నాగరాజు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాలు కాలువను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ ఈ గోపీనాథ్.





**కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 11:**కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా ముక్కోలు బెడ్ రెగ్యులేటర్ వద్ద వాలు కాలువ వద్ద క్రాస్ బండ్ కొట్టుకుపోయింది. దీన్ని మంగళవారం ధవలేశ్వరం ఇరిగేషన్ ఎస్ ఈ గోపీనాథ్ పరిశీలించారు. జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అదేశాలు మేరకు ఏలేరు ప్రాజెక్ట్ ఏమిటి చైర్మన్ బస్వా వీరబాబు తో కలిసి ఏలేరు వాలు కాలువ వెంబడి ఉన్న గట్లను శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే నెహ్రూ ఆదేశాల మేరకు పరిశీలించడం జరిగిందన్నారు . ఇరిగేషన్ డి ఈ, రవికుమార్ ను కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు ఇరిగేషన్ ఏఈ, వై శ్రీనివాస్ అనపర్తి సూరిబాబు తదితరులు ఉన్నారు.

# శ్రీ జనార్ధన స్వామి వారి దర్శనానికి ఇతర రాష్ట్రాలనుండి పోటెత్తిన భక్తులు






**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 11:**ఉమ్మడి జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన నవ జనార్ధన స్వామి ఆలయాల్లో ఒకటైన శ్రీశ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు.కార్తీకమాసం విశిష్టతను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లోని ఉన్న వివిధ ప్రాంతాలైన కోరుకొండ, విజయవాడ, హైదరాబాద్ నగరాలనుండి భక్తులు విచ్చేసి మండల కేంద్రమైన ఆలమూరులోని వేంచేసియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి వారిని దర్శించుకున్నారు.వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వాగతించి గా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారాణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయ విశిష్టతను స్థానిక కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాచీన చరిత్ర కలిగి నారద మహామునిచే ప్రతిష్టించబడ్డ ఈ దేవాలయ గొప్పతనాన్ని ప్రసార మాధ్యమాల్లో తెలుసుకున్నామని మహిళలు వ్యాఖ్యానించారు. స్వయంభుగా వెలసిన జనార్ధన్వామిని దర్శించుకోవడం ఆనందంగా భావిస్తున్నానని భక్తులు తెలిపారు.

# పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత





ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

**పెద్దాపురం, పెన్ పవర్, నవంబర్ 11 :** జిల్లాలో ఉన్న ప్రత్యేక వనరులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి పెదఈర్లపాడు నుంచి కాకినాడ జిల్లాలో నాలుగు ఎంఎస్ఎంఈలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. జిల్లా పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో స్థానిక ఏడీబీ రోడ్డులో మంగళవారం నిర్వహించిన పరిశ్రమలు – ఉపాధి కల్పన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని ఇక్కడ ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా పెట్టుబడుల నిమిత్తం విదేశాల్లో పర్యటించారన్నారు. ఈ పర్యటనల ద్వారా రాష్ట్రంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నట్లు ఆయన తెలిపారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకమనే విషయాన్ని గుర్తించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళు_ందన్నారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు కూడా అందిస్తూ పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ అవకాశాన్ని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 22 జిల్లాల్లో ప్రారంభిస్తున్న ఎంఎస్ఎంఈలలో భాగంగా మన జిల్లాలో నాలుగు పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిని కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేలా వివిధ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, అమరావతికి క్వాంటం వ్యాలీ, విశాఖపట్టణానికి ప్రసిద్ధ గూగుల్ వంటి ప్రసిద్ధ సంస్థలు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో పాటుపడుతుందని, రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకువచ్చే లక్ష్యంతో ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో 45 దేశాల ప్రతినిధులతో పెద్ద ఎత్తున సమ్మిట్ నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, బోళ్ళ వెంకటరమణ, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, నూనె రామారావు, అడబాల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# దాలిపాడు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సివిల్ సర్వీసెస్ అధికారులు





**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 11:** మండలంలో పర్యటిస్తున్న ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు మంగళవారం దాలిపాడు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.
దాలిపాడు లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిల యొక్క కల్చరల్ ఏక్టివిస్ ను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినిలతో పాటు దింసా నృత్యంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుచున్న సౌకర్యాలని అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ అధికారులందరికీ అల్పాహారం అందించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సివిల్ సర్వీసెస్ అధికారులను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో సివిల్ సర్వీసెస్ అధికారులు గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. విద్యార్థినుల, ఉపాధ్యాయుల అభిమానానికి అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాలిపాడు సర్పంచ్ కే.వెంకయ్యమ్మ, ఎంపీటీసీ వలాల విశ్వమ్మ,ఎంపీడీవో కే.బాపన్న దొర, మండల తహసిల్దార్ పి. వేణుగోపాల్, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, దాలిపాడు సచివాలయం ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యవసరంలో శక్తి యాప్ మహాయుధం



★ అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి

**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 11:**మహిళల పాలిట శక్తి యాప్ అత్యవసర సమయాల్లో మహా ఆయుధంగా ఉంటుందని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి నరసింహమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీఐ నరసింహమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి టీమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాలికల రక్షణ కోసం ప్రతి పాఠశాలలోనూ శక్తి టీం ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా యాంటీ ర్యాగింగ్ నివారించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు నిషేధమని చట్టాన్ని ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా వినియోగం వంటి వాటికి యువత దూరంగా ఉండాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహర్షి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలి-ప్రసంగి రాజు




**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 11**

గ్రామపంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా స్థానికంగా ఉండే అధికారులు కృషి చేయాలనిఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పంచాయతీ వనరుల జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి ప్రసంగి రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో మండలంలోని గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ వనరుల పెంపు రికార్డు నిర్వహణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కేవలం ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల పై వచ్చే ఆదాయంతోనే పంచాయతీని నడపడం కాదని, గ్రామంలో ఆదాయ వనరులు అన్వేషించి వాటి ద్వారా పంచాయతీ ఆదాయం పెరిగే విధంగా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న వసతులు, వనరులను తెలుసుకొని వాటి ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామాల్లో ఉన్న సమస్యలను స్థానికంగా వచ్చే ఆదాయంతో తామే పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

# కోనసీమలో భారీ పంట నష్టం

* రైతులకు తక్షణ సహాయం అందించాలని మాజీ ఎంపీ డిమాండ్..



**ఆలమూరు, పెన్ పవర్ నవంబర్ 11:**ఇటీవల సంభవించిన వరదలు, గాలివానల కారణంగా విస్తారంగా పంట నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో, రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎంపీ చింతా అనురాధ మీడియా ముఖంగా డిమాండ్ చేశారు.జిల్లాలో సుమారు 73 వేల ఎకరాల వరి, తోట పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఇది చిన్న నష్టం కాదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హార్టీకల్చర్ పంటలతో పాటు పలు రకాల వ్యవసాయ ఉత్పత్తులు నాశనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందానికి రైతులు తమ నిజమైన స్థితిని వివరించగా, బృందం సానుకూలంగా స్పందించిందని మాజీ ఎంపీ పేర్కొన్నారు. సాధారణంగా ఈ విధమైన పర్యటనలు ఆలస్యంగా జరుగుతాయని, అయితే ఈసారి కేంద్ర బృందం వేగంగా స్పందించడం ద్వారా ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న చిత్తశుద్ధి తెలుస్తోందని చెప్పారు.రైతులకు నష్టపరిహారం చెల్లింపులు కూడా అదే వేగంతో జరగాలని ఆమె ఆకాంక్ష వ్యక్తం చేశారు. మొందా సైక్లోన్ నష్టం తర్వాత రైతులు బిత్తరపోతున్నందున ప్రస్తుత ప్రభుత్వం త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కోస్తా ప్రాంతాల్లో తరచుగా వరద ముప్పు ఎదురవ్వడానికి ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగా పని చేయకపోవడమేనని మాజీ ఎంపీ పేర్కొన్నారు. వాటిని శుభ్రం చేయకపోవడం వల్లనే పంటల నష్టం తీవ్రతను పెంచుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా భవిష్యత్తులో రైతులను కాపాడవచ్చని ఆమె సూచించారు.

# మండలంలోని మొంథా తుఫాన్ పంట నష్టం పరిశీలించిన కేంద్ర బృందం





**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 11:**ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని దెబ్బతిన్న పంట నష్టంపై కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మండలంలోని పెనికేరు గ్రామంలో మంగళవారం సెంట్రల్ అగ్రికల్చరల్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్ను స్వామి, సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాసు బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తి సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా, విసి అండ్ ఎండి ఎస్.ఢిల్లీ రావు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఏఎన్జిఆర్ఏయు పి.సత్యనారాయణలతో కలిసి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ లు పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుండి డిప్యూట్ అయిన నాలుగు సభ్యుల బృందాలు ఆలమూరు మండల పరిధిలో పెనికేరు గ్రామంలో వరి పంటకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్ విభాగాల నిపుణులతో కలిసి పెనికేరు, ఆలమూరు ప్రాంతాల్లో పంట నష్టం స్థితిని క్షేత్రస్థాయిలో చూసి అవగాహన చేసుకున్నారు. అలాగే జిల్లాలో సుమారు 71,000 ఎకరాల్లో వరి పంట, 2,500 ఎకరాల్లో అరటి తోటలతో పాటు ఇతర హార్టికల్చర్ ప్లాంటేషన్లకు కలిగిన నష్టాలను కేంద్ర బృందం పరిశీలించి, తర్వాత సంబంధిత శాఖ అధికారుల ద్వారా అందించిన సమాచారం వారికి వివరించినట్లు తెలిపారు. మొంథా తుఫాను సమయంలో తీసుకున్న ఏర్పాట్లు, విద్యుత్ సేవ పునరుద్ధరణ వేగం, ఇతర సహాయక చర్యలు రైతులకు పంపిణీ చేసిన విధానాలు వారికి వివరించినట్లు కలెక్టర్ తెలిపారు . పంట నష్టం తీవ్రత, దానివల్ల రైతులు ఎదుర్కొన్న కష్టాలు, మిల్లింగ్ సమయంలో కలిగే నష్టాల వివరాలను బృందానికి వివరించినట్లు కలెక్టర్ మహేష్ కుమార్ మీడియాకు తెలిపారు. కేంద్ర బృందం ఈ సమాచారం మేరకు వివరాలను స్వీకరించి సానుకూల స్పందన అందించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలియజేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తక్షణమే తీసుకునేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులు బృందంతో మాట్లాడుతూ ధాన్యం ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చే వరి పంట, ఇప్పుడు 20 బస్తాలు మాత్రమే దిగుబడి అవ్వడంతో తాము భారీగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం త్వరతగతిని ఆదుకొనేల చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందానికి తమ విజ్ఞాపన పత్రాన్ని తమ నాయకులతో కలిసి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు, జిల్లా సహాయ వ్యవసాయ అధికారి ఏ.రాజశేఖర్, ఏడిఏ సిహెచ్.కె.వి.చౌదరి, ఎంపీడీవో ఏ.రాజు, తహసిల్దార్ ప్రకాష్ బాబు, ఏవో బి.మీనా, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తున్న ప్రజా నాయకుడు

* ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబరు 11:**నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ప్రజాలకు నిత్యం అందుబాటులో ఉండి,
పేదల కోసం నీతినిజాయితీతో పనిచేస్తున్న ప్రజల నాయకునిగా తనదైన ముద్రవేసుకున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు
అవగాహన లేని ఆరోపణలు చేయడం దారుణమని రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరక్టర్ శిరిగినీడి
వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి
అన్నారు. కొర్లపాటివారిపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కూటమి
నాయకులు వైసిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గన్నవరపు శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణ చెప్పే వరకూ ఆయన పాల్గొనే కార్యక్రమాలను అడ్డుకుంటామని
హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తమ పార్టీ నాయకుల అండతో జరిగిన అవినీతి విషయాన్ని తెలుసుకోవాలని మండిపడ్డారు. మొబైల్ డిస్టిబ్యూటింగ్ యూనిట్ వాహనాల మంజూరిలో నూ, పదవుల పంపకంలో అవినీతి జరిగిన విషయం మర్చి అవగాహన లేకుండా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై ఆరోపణలు చేయడం సరికాదాని హెచ్చరించారు. వెంటనే ఎమ్మెల్యే కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేసారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, సుంకర గణపతిరావు,
అల్లాడ రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, ఎమ్ పిటిసి వాకపల్లి దొరబాబు, డిసి వైస్ చైర్మన్ అక్కిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు
అరిగెల బలరామమూర్తి, పెదపూడి శ్రీనివాసరావు,
మైపాల తాతాజీ, మట్టపర్తి సోమేశ్వరరావు, సుంకర బాలాజీ,
నాగాబత్తుల సుబ్బారావు, కొర్లపాటి గోపి, రవణం రాము, నేదునూరి పెద్దిరాజు, కత్తుల బాబులు, పితాని కేశవరావు, కొప్పినీడి ఈశ్వర రావు, గుబ్బల రమణ, వంగా చిన్నా, కొల్లూరి శివ, పితాని రామకృష్ణ, దాసరి శ్రీ నివాసరావు, పత్తి దత్తుడు, బండారు అబ్బులు, పితాని శ్రీ నివాసరావు, బొరుసు రాజా, వక్కపట్ల సుబ్రహ్మణ్యం, వక్కపట్ల ఆదిత్య, మట్టపర్తి బులిస్వామి, ములపర్తి రమేష్
బిజెపి నాయకులు కముజు శ్రీ నివాసరావు, అయ్యగారి శ్రీనివాసరావు,
తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ ఆఫీసులో ఐజీ అశోక్ కుమార్ వార్షిక తనిఖీ

పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్
రోడ్డు ప్రమాదాలు, గంజాయిపై ప్రత్యేక చర్యలు





**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 11 :**
వార్షిక తనిఖీలో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ మంగళవారం ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ కూడా ఉన్నారు. ప్రత్తిపాడు చేరుకున్న ఐజీ అశోక్ కుమార్‌కు పోలీస్ అధికారులు స్వాగతం పలికి, పోలీస్ గార్డ్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఐజీ అశోక్ కుమార్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సర్కిల్ పరిధిలో మేజర్ ఇష్యూస్ ఏమీ లేవని, రొటీన్ క్రైమ్స్‌ను వెంటనే పరిష్కరించడం జరుగుతోందని తెలిపారు.
చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించి, తక్షణమే రౌడీ షీట్లు ఓపెన్ చేయాలని ఐజీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రతిరోజూ ఒక ఎస్సైతో పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. రాత్రిపూట ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్లపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి రవాణా చేసేవారు, విక్రయించేవారు, సాగు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్', సోషల్ మీడియా వేధింపుల వంటి అంశాలపై బాల బాలికలకు శక్తి టీం లతో పాటు స్థానిక ఎస్సైలతో అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్సైలు ఎస్ లక్ష్మి కాంతం, ఎన్ రామలింగేశ్వరరావు, ఎల్ ప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీల పురోభివృద్ధికి నూరుశాతం పన్నులు

జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శాంత లక్ష్మి.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 11:**నూరు శాతం పన్నులు వసూలుతో పంచాయతీల పురోభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి డి.శాంత లక్ష్మి అన్నారు. మండలంలోని చొప్పెల్ల పంచాయతీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యదర్శిని పంచాయతీకి సంబంధిత రికార్డులు, జరిగిన పనుల తీరు, శానిటేషన్, డ్రైనేజ్ క్లీనింగ్ వంటి అంశాలపై క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థలో పనిచేసే సిబ్బంది విధులలో పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే వసూలు చేసిన పన్నులు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అకౌంట్ నందు జమ చేయాలని అన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించవద్దని విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. వ్యవస్థ పనితీరులో ఎక్కడ వెనుకబాటు తనం చోటు చేసుకోకూడదని సిబ్బందికి సూచించారు. గ్రామంలో త్వరితగతన నూరు శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శి కి ప్రత్యేకంగా వివరించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, గుమస్తా శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కాలేజీల బస్సులపై తనిఖీలు నిర్వహించండి -ప్రమాదాలను అరికట్టండి



**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 11:**
కాకినాడలో మంగళవారం సాయంత్రం సాంబమూర్తి నగర్ సమీపంలో జరిగిన దుర్ఘటన స్థానికులను కలచివేసింది. శ్రీ చైతన్య కాలేజీ బస్సు అదే కాలేజీకి చెందిన ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థి కంబాల యువన్ శంకర్ను ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడు.ఈ సంఘటనపై బుధవారం ఉదయం మృతుని కుటుంబ సభ్యులు, దుమ్ములిపేట పెద్దలు, మాజీ కార్పొరేటర్లు, విద్యార్థులు కలిసి ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, యువ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆందోళనకు ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులపై లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, వారి భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలేజీ బస్సుల్లో సగటున 40 మందికి పైగా విద్యార్థులు ప్రయాణిస్తారు. వారి ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయి. కానీ తక్కువ వేతనాలు ఇచ్చి, వయసు పైబడిన వారితో డ్రైవింగ్ చేయించడం ప్రమాదాలకు దారితీస్తోంది," అని అన్నారు. ప్రసాద్ మరింతగా మాట్లాడుతూ, "యువన్ శంకర్ మృతి వంటి ఘటనలు ఇక జరగకుండా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రైవేట్ కాలేజీల బస్సులపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. అనర్హ డ్రైవర్లను నియమించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి," అని డిమాండ్ చేశారు.ప్రైవేట్ యాజమాన్యం లాభాల పైనే దృష్టి పెట్టి విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని ఆయన విమర్శించారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్ ఎంపిక, వేతన విధానం, వాహనాల పరిస్థితిపై క్రమం తప్పని తనిఖీలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అగ్నిభాధితులకు ఆర్థికసహాయం అందజేత

-టేకులబోరు,ఉపాధ్యాయులు,విద్యార్థులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.11**
మండలంలోని సీతంపేటగ్రామంలోఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి గురైనగృహాల అగ్నిభాదితులు ముత్యాల జయలక్ష్మి,కోట్లరమణయ్య వారి గృహాలుపూర్తిగా అగ్నికు ఆహుతికావడంతో సర్వంకోల్పోవడం జరిగింది.ఈవిష యం తెలుసుకున్న కూనవరంమండలంలోని టేకులబోరు విక్టోరియా మాంటిస్సోరి హైస్కూల్,ఉపాధ్యాయులు విద్యార్థులుమంగళవారం అగ్నిభాదితులకు ఆర్థిక సహాయంగా బియ్యం,కందిపప్పు,మంచినూని,సబ్బులు, దుస్తులుకూరగాయలు నిత్యవసర సరుకులు,అందజేశా రు.అగ్నిభాదితుల ఒక్కొక్క కుటుంబానికి మూడువేల నూటయాభై రూపాయలు రెండుకుటుంబాలకు ఆరువేల మూడువందల పద్నాలుగురూపాయలు ఆర్థికసహాయం గాఅంజేశారు.సీతంపేట అగ్నిభాదితులు ఉపాధ్యాయు లకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.



# వైజాగ్ కు ఐటీ కంపెనీల క్యూ




**విశాఖపట్టణం, నవంబర్ 11, పెన్ పవర్:** : విశాఖపట్నం ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. గూగుల్, టీసీఎస్ వంటి సంస్థలు రాకతో నగరంలో స్థిరాస్తికి డిమాండ్ పెరిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో పెట్టుబడులు ఆకర్షిస్తున్నాయి. ఈ నెల 14-16 తేదీల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 స్థిరాస్తి రంగంపై అవగాహన కల్పించనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగరతీర నగరం విశాఖపట్నంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. నగరాన్ని ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలతో పాటుగా మరొకిన్ని సంస్థలు విశాఖపట్నంలో కంపీనలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. మరికొన్ని ఐటీ కంపెనీలు కూడా విశాఖపట్నంవైపు చూస్తున్నారు. గత నెలలో గూగుల్ డేటా సెంటర్ ఎంవోయూతో విశాఖపట్నం దశ తిరిగింది. విశాఖపట్నం కేంద్రం ఐటీ కంపెనీలు, పర్యాటక, సేవారంగ సంస్థలు త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ క్రమంలో చాలామంది నగరంలో స్థిర నివాసం కోసం చూస్తున్నారు. నగరంలో రియల్ బూమ్ వచ్చింది.. స్థిరాస్తి రంగం కూడా నగరానికి అన్ని వైపులా విస్తరిస్తోంది.విశాఖపట్నంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతుండటంతో, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానుండటంతో, ప్రజలు స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్రలో నిర్మాణ రంగం పుంజుకుంది.. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ కొత్త నిర్మాణాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం అపార్టుమెంట్లలో పది వేలకు పైగా ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.35 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. సొంతంగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారి కోసం ఉత్తరాంధ్రలో 50 వేలకు పైగా ఖాళీ స్థలాలు సిద్ధంగా ఉన్నాయి. నరెడ్కో (జాతీయ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) గుర్తింపు పొందిన పలువురు బిల్డర్లు, అందుబాటు ధరల్లో గృహ సముదాయాలను నిర్మిస్తున్నారు.విశాఖపట్నంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 పేరుతో ఒక ప్రత్యేకమైన స్థిరాస్తి ప్రదర్శన జరగనుంది. నరెడ్కో ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో జరిగే ఈ కార్యక్రమంలో, సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చే దేశ, విదేశీయులకు విశాఖపట్నం స్థిరాస్తి రంగంపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల ప్రాజెక్టుల వివరాలను పండగ వాతావరణంలో అందించనున్నారు. ఈ వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025లో భాగంగా, జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను ఒక భారీ స్టాల్‌లో ప్రదర్శిస్తారు.అలాగే, భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్ కింద ఆ పరిసర ప్రాంతాల్లోని స్థిరాస్తి ప్రాజెక్టులను కూడా పరిచయం చేస్తారు. వీఎంఆర్‌డీఏ, మెట్రో ప్రాజెక్టులకు కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేక స్థానం కల్పించారు. ప్రతి గంటకు లక్కీ డ్రాలు నిర్వహిస్తారు. ఈ డ్రాలలో బైకుల్ని బహుమతులుగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూబీఐ, ఎల్ఐసీ, బ్యాంకు ఆఫ్ బరోడా వంటి ప్రముఖ బ్యాంకులు పాల్గొంటున్నాయి. ప్రదర్శనలో 60కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.ఈ ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఇళ్లు మాత్రమే కాదు విశాఖపట్నంలో భూముల్ని కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే చాలామంది నగరంలో భూముల కొనుగోలు చేయగా.. మరికొందరు కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. విశాఖపట్నంలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, ఆనందపురం, మధువాడ, అక్కయ్యపాలెం వంటి చాలా ప్రాంతాల్లో భూములకు డిమాండ్ పెరిగింది. అలాగే నగరంలోని పలు ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తానికి విశాఖపట్నంలో భూమి, ఫ్లాట్లు ఉంటే చాలు వాళ్ల పంట పండినట్లే.

# అన్నవరంలో తిరుమల తరహా సేవలు

**కాకినాడ, నవంబర్ 11, పెన్ పవర్:** తిరుమల తరహాలోనే అన్నవరం సత్యదేవుని ఆలయంలోనూ భక్తులకు సేవ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కార్తీక మాసం సందర్భంగా 5,225 మందికి పైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి పనుల్లో తోడ్పడుతున్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు ఆలయ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆలయం, అనుబంధ ఆలయాలలో భక్తులు సేవ చేసే అవకాశం కల్పిస్తోంది టీటీడీ. ఇదే తరహాలో రాష్ట్రంలో ప్రధాన ఆలయాల్లో కూడా సేవకు అవకాశం కల్పిస్తోంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కూడా సేవలందించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఏకంగా 5,225 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు. భక్తులు 25, 50, 100 మందితో బృందాలుగా ఏర్పడి సేవలు అందిస్తున్నారుఈ వాలంటీర్ల సేవలు అన్నవరం ఆలయ నిర్వహణకు ఎంతో తోడ్పడుతున్నాయి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వీరి పాత్ర కీలకం. అధికారులు వీరిని ఆలయ ప్రధాన సేవలు, అన్నదానం, భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్లలో సేవలందించేందుకు కేటాయిస్తున్నారు. బృందాలుగా ఏర్పడిన వాలంటీర్లకు వారి విధుల గురించి ముందుగానే తెలియజేస్తున్నారు. రోజువారీ పనులు, భక్తుల రద్దీ, పండుగల సమయంలో అవసరమయ్యే వాలంటీర్ల సంఖ్యను అధికారులు అంచనా వేసి, ఆ మేరకు వారికి సమాచారం అందిస్తారు. దీనివల్ల సేవా కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో సేవకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భక్తులకు సేవ చేయాలనుకునే సేవకులు ఆలయం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆసక్తి ఉన్న తెలుగు రాష్ట్రాల భక్తులు వెంటనే.. %ట్ట్రజూ:///ఱఱఱ.ఖఅఝుఝుతీఖఎ నవఝుర్ష్టుఝుఎ.ఱశీఎ% వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అక్కడ %ూవఝు =వస్త్రఱర్‌తీష్ఱశీఅ% ఆప్షన్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకుంటే సరిపోతుంది. 'భక్తులు సేవ పేరు, ఎన్ని రోజులు, బృందాలుగా, వ్యక్తిగతంగా సేవ చేస్తారా, ఎందరు సభ్యులు, అన్నదానం, రద్దీ' తదితర అంశాలు.. ఎక్కడ సేవ చేయాలనుకుంటున్నారో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. టీమ్ ప్రతినిధి ఫోటో, ఐడీ కార్డు, పేరు, డేట్ ఆఫ్ బర్త్, వయసు, మొబైల్ నంబర్, ఫిట్‌గా ఉన్నారా లేదా, అడ్రస్ వంటి పూర్తి వివరాలు నమోదు చేయాలి. టీమ్‌లుగా సేవ చేయాలనుకుంటే కనుక.. టీమ్ సభ్యుల పేర్లు, వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. భక్తులు నమోదు చేసిన వివరాలు పరిశీలించిన అనంతరం ఆలయ గుర్తింపుకార్డు అందజేస్తారు. భక్తులకు సేవ చేయాలనుకునే సేవకులు నేరుగా ఆలయానికి వచ్చి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అన్నవరం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ప్రధాన ఆలయాల్లో కూడా ఇలాగే సేవకులుగా సేవ చేసేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు.

# 35 శాతం ఎమ్మెల్యేలు గీత దాటేసారా

**విజయవాడ, నవంబర్ 11 పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ నలభై ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉంది. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలో క్రమశిక్షణ కట్టు తప్పుతుంది. కొత్త వాళ్లను ఎంపిక చేయడం తాను చేసిన తప్పా? అన్న చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లో కొంత మాత్రమే నిజముంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలోనూ ఎన్టీఆర్ ఎందరో కొత్త వాళ్లకు రాజకీయంగా అవకాశం కల్పించారు. అప్పుడు కూడా పార్టీ లైన్ ఎవరూ దాటే ప్రయత్నం చేయలేదు. 1995లో చంద్రబాబు పార్టీని తన చేతుల్లోకి తీసుకున్న తర్వాత కూడా తటస్థులంటూ కొత్త వారికి టిక్కెట్లు ఇవ్వడం జరిగాయి. ఆ ప్రయోగమూ విఫలం కాలేదు. కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం ఎమ్మెల్యేలు అందులోనూ కొత్తగా మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలు మాత్రమే కట్టుతప్పుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. కానీ క్రమశిక్షణ చర్యలను తీసుకునే పరిస్థితుల్లో పార్టీ నాయకత్వం లేదన్నది వాస్తవం. కొలికపూడి శ్రీనివాసరావు నుంచి మొదలుపెడితే ఎవరూ ఏమీ తక్కువ కాదన్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, తంబళ్లపల్లి ఇన్ ఛార్జి జయప్రకాష్ రెడ్డి ఇలా ఒక్కరు కాదు.. అనేక మంది యువ ఎమ్మెల్యేలు అనేక వివాదాల్లో వరసగా చిక్కుకుంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడంతో వాటిని సంపాదించుకునేందుకు తపన పడే వారి సంఖ్య ఎక్కువగా కననపడుతుంది. అందులోనూ ఇసుక, మద్యం వంటి అంశాల్లోనూ ఎమ్మెల్యేల జోక్యం ఉండటంతో అధినాయకత్వానికి తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. వారిని ఆపడం ఎలాగో తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి కూడా అంతు చిక్కని సమస్యగా మారింది. అపార రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు సయితం ఏమీ చేయలని పరిస్థితుల్లో ఉన్నారు.. ఇక తాజాగా 48 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల్లోనూ పాల్గొనడం లేదంటే ఏ రేంజ్ లో వారి ధిక్కార స్వరం వినిపపడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నడూ లేనిది తెలుగుదేశం పార్టీలో ఇలాంటి పరిస్థితి రావడానికి నాయకత్వం యాభై శాతం కారణమయితే.. ఎన్నికల్లో పెరిగిపోయిన విపరీతమైన ఖర్చు కూడా మరొక కారణంగా చెప్పాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నా 48 మంది ఎమ్మెల్యేలు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటే నాయకత్వాన్ని కేర్ చేయకపోవడమేనని స్పష్టంగా అర్థమవుతుంది. ఇది రానున్న ప్రమాదానికి సంకేతాలుగానేన చెప్పాలి. ఉన్న 135 ఎమ్మెల్యేల్లో 48 మంది



ఎమ్మెల్యేలంటే 38 శాతం అస్సలు ప్రభుత్వాన్ని పార్టీని పట్టించుకోలేదనే భావించాలి. వీరంతా సొంత పనులు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు. టీడీపీకి నిజంగా ఇది వేకప్ కాల్. దీని నుంచి బయట పడకపోతే ఇబ్బందులు తప్పవు. అందుకే చంద్రబాబు నాయుడు సరైన సమయంలో సరైన నిర్ణయం అని నాన్చకుండా సీరియస్ యాక్షన్ దిగాలని పార్టీ క్యాడర్ కోరుకుంటుంది.


### సరైనా సమయంలో సరైన నిర్ణయం

తిరువూరు వివాదంలో తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కమిటీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుదే తప్పని తేల్చింది. ఇది ఊహించని విషయమేమీ కాదు. కొలికపూడికి వివాదమూ కొత్తేమీ కాదు. గతంలో అనేక వివాదాల్లో చిక్కుకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. చంద్రబాబు హెచ్చరికలంటే ఆయనను దగ్గర నుంచి చూసిన వారికి అందరికీ తెలుసు. చంద్రబాబు నాయుడు హెచ్చరికల కంటే రాజకీయ భవిష్యత్ పైనే ఎక్కువగా హిత బోధ చేయడం అలవాటు. అందుకే కొలికపూడి పెద్దగా పట్టించుకోలేదన్న టాక్ కూడా పార్టీలో వినిపిస్తుంది. అయితే క్రమశిక్షణ కమిటీ ఈ వివాదంలో కొలికపూడి శ్రీనివాసరావుదే తప్పని తేల్చినా ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకునే అవకాశాలు ఎంత మాత్రం లేవన్నది వాస్తవం... పోలింగ్ పెరిగితే ఎవరికి లాభం? ఇంకా మూడేళ్ల సమయం... శాసనసభ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు వేయడం వేరు. కానీ కొలికపూడి రూటు వేరు. ఆ సంగతి పార్టీలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కొలికపూడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే మూడేళ్ల పాటు తలనొప్పులు భరించాల్సి ఉంటుంది. అసెంబ్లీలోనూ, బయటా ఆయన వ్యవహార శైలి మారుతుంది. ఆయనను అడ్డుకునే పరిస్థితి ఎవరూ చేయరు. కొలికపూడి శ్రీనివాసరావును సామాజికవర్గంలో చూడకపోయినా, ఆయన రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసిన వ్యక్తి అని తెలుసు. ఆయన టీడీపీలో ప్రతి రోజూ ఏదో థౌంజడ్ వాలాను పేలుస్తూ వెళతాడు. అసలు విషయాలు పక్కదారి పట్టి కొలికపూడి హైలెట్ అయ్యే అవకాశాలున్నాయి. అందుకే చంద్రబాబు నాయుడు సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని చెప్పడం వెనక కూడా ఇదే కారణం. వచ్చే ఎన్నికల వరకూ ఓపిగ్గా కొలికపూడి శ్రీనివాసరావును భరించడం తప్ప మరో మార్గం చంద్రబాబుకు లేదు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా కొలికపూడికి టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆ విషయం కొలికపూడికి కూడా అర్థమయి ఉంటుంది. కానీ ఈ మూడేళ్ల పాటు ఆయనపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకుంటేనే ఇద్దరికీ ఉత్తమం అన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది. దూకుడా అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటే ఇక కొలికపూడి వేసే సర్జికల్ స్ట్రయిక్స్ ను నిత్యం భరించాల్సి వస్తుంది. అంత సాహసం పార్టీ నాయకత్వం చేయకపోవచ్చు. కాబట్టి కొలికపూడి శ్రీనివాసరావుపై ఇప్పట్లో చర్యలు తీసుకోరన్నది వాస్తవం. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వరన్నది కూడా అంతే నిజం. అందుకోసమే చంద్రబాబు బహుశా చంద్రబాబు ఆ డైలాగ్ వాడి ఉంటారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వర్క్ స్టేషన్లు

**రాజమండ్రి, నవంబర్ 11, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్క్ స్టేషన్ల ఏర్పాటు కోసం ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ఏపీ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో పనిచేసుకునేందుకు వీలుగా.. ఈ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ వర్క్ స్టేషన్ల ద్వారా ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునే వెసలుబాటు కలుగుతుంది. అటు వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం నుంచి సాయం, ఉపాధి లభించనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి మండలంలో వర్క్ స్టేషన్లు ఏర్పాటుచేయాలని సంకల్పించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో డిజిటల్ అనుసంధానమైన స్పేర్ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వరకూ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. అలాగే వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఆర్థిక సాయం కూడా అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కేబినెట్ భేటీలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది.మరోవైపు రాష్ట్రంలోనియువతకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండి.. టెక్నాలజీపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి ఈ విధానంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కౌశలం సర్వే చేపట్టారు. ప్రస్తుతం సర్వే పూర్తవగా.. వివరాలను నమోదు చేసుకున్న వారికి తదుపరి ప్రక్రియ ప్రారంభించనున్నారు. వీరితో పాటుగా.. వివిధ కంపెనీలలో పనిచేస్తూ ఇప్పటికే వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారికిప్రతి మండలంలో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి.. బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ వర్క్ స్టేషన్‌లో కనీసం 20 నుంచి 25 మంది పని చేసుకునేలా సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తారు. మరోవైపు చెన్నై,
బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల్లో ఏపీకి చెందిన వారు చాలా మంది ఉంటున్నారు. మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఏపీకి చెందిన యువత ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు.
అయితే ఇలాంటి వారు ఇంటి నుంచి పనిచేసేలా వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే.. వారికి ఇంటి అద్దె, రవాణా, ఇతర ఖర్చులు తగ్గటంతో పాటుగా ఆయా కంపెనీలకు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ వర్క్ స్టేషన్ల ఆలోచన చేశారు. ఇవి కార్యరూపం దాల్చిన తర్వాత.. ప్రభుత్వం ప్రైవేటు ఐటీ, ఇతర సంస్థల యాజమాన్యాలతో చర్చలు జరపనుంది. ఇవి అమల్లోకి వస్తే అటు ఉద్యోగులతో పాటుగా.. ఏర్పాటు చేసే వారికి కూడా ఉపాధి, ప్రభుత్వ సాయం అందుతుంది.

# తీర ప్రాంతాల్లో భారీగా క్లస్టర్లు...



**ఒంగోలు, నవంబర్ 11, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసింది. తీరం వెంబడి పోర్టులతో పాటు పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే సేవలు అందిస్తున్న పోర్టులతో పాటు.. నిర్మాణంలో ఉన్న పోర్టుల సమీపంలో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకి సిద్ధమవుతోంది. ఈ మేరకు పోర్టు ప్రాక్సిమల్ ఏరియాలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1,220 కోట్లు కేయాయించాలనే ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఒక్కో పోర్టు సమీపంలో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. పోర్టులు, అనుబంధ పరిశ్రమలతో లక్షల మందికి ఉపాధి కల్పించే సామర్థ్యం ఈ తీర ప్రాంతానికి ఉంది. అయితే చాలా ప్రభుత్వాలు తీర ప్రాంత అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లలేకపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీర ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించింది. రాష్ట్రంలోని తీర ప్రాంతంలో పోర్టులు.. వాటికి అనుసంధానంగా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. తీర ప్రాంతం వెంట జిల్లాల్లో మారిటైం ప్రాజెక్టులు తెచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. అందుకోసం పోర్టు ప్రాక్సిమల్ ఏరియా.. అంటే పోర్టు నుంచి కనీసం రెండు మూడు కి.మీ. పరిధిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి రూ. రూ.1,220 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.ఓడరేవు సమీపంలో జరిగే కార్యకలాపాలకు అనుగుణంగా.. ఆయా క్లస్టర్లు అభివృద్ధి చేయనున్నారు. దాని కోసం పోర్టుకు సమీపంలో ఉన్న ఉప్పు భూములను వినియోగించుకోవాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ భూములను రాష్ట్రానికి కేటాయించేలా కేంద్రాన్ని కోరాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధితో పాటు.. పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంలో ఉన్న గ్రామాలను కలుపుకుని నగరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నగరాలకు కావాల్సిన మౌలికసదుపాయాల నిర్మాణానికి.. సాగరమాల 2.0 నిధులు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రచిస్తోంది.ఏపీలో ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడ, గంగవరం, కృష్ణపట్నంలో పోర్టులు ఉన్న సంగతి తెలిసిందే. వీటికి అదనంగా.. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ సెజ్‌లో కొత్త పోర్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా నావల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్స్ కోసం రాంబిల్లిలో.. మరో పోర్టును నిర్మిస్తున్నారు. వీటికి అదనంగా నక్కపల్లి, దుగరాజపట్నంలో పోర్టులు నిర్మించాలని ప్రభుత్వం అనుకుంటోంది.

ఇలా ప్రతి 50 కిలోమీటర్లకు ఓ పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్‌లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇప్పటికే ఉన్న విశాఖపట్నం పోర్టు సమీపంలో సముద్ర ఆధారిత వాణిజ్యాన్ని ప్రోత్సహించేలా క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. మూలపేట పోర్టు సమీపంలో రసాయన పరిశ్రమలు, వాటికి అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే యూనిట్ల క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాంబిల్లిలో నిర్మిస్తున్న పోర్టు సమీపంలో రక్షణరంగ పరిశ్రమల కోసం క్లస్టర్.. కాకినాడలో పెట్రోలియం ఆయిల్, లూబ్రికెంట్స్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా క్లస్టర్.. మచిలీపట్నంలో హెవీ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ రంగానికి సంబంధించిన క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలా రామాయపట్నం, కృష్ణపట్నం, దుగ్గరాజపట్నం వంటి పోర్టుల సమీపంలో.. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రంగాలకు చెందిన పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## జడేజాను రిటైన్ చేసుకోవాలి.. CSK కోసం చేసిన పోరాటం మర్చిపోకూడదు: రైనా



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నుంచి స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ట్రేడింగ్ ద్వారా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు వెళు న్నాడనే వార్తలు ప్రస్తుతం సంచలనంగా మారాయి. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 12 సీజన్ ల పాటు చెన్నై జట్టులో కొనసాగిన ఈ స్టార్ ఆల్ రౌండర్ ను చెన్నై సూపర్ కింగ్స్ వదులుకోవడానికి సిద్ధమైంది. సూపర్ కింగ్స్ తమ జట్టులోకి రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ను ట్రేడింగ్ ద్వారా తీసుకోనుంది. శాంసన్ చెన్నై జట్టులోకి వస్తే ట్రేడింగ్ ద్వారా వారు జడేజాతో పాటు ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ సామ్ కరణ్ ను రాజస్థాన్ కు ఇవ్వడానికి అంగీకరించినట్టు తెలుస్తుంది.


అధికారిక ప్రకటన రాకపోయినా ఈ ట్రేడింగ్ దాదాపు కన్ఫర్మ్ అయినట్టు గట్టిగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ లెజెండరీ ఆటగాడు సురేష్ రైనా ఆల్ రౌండర్ జడేజాపై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. రైనా మాట్లాడుతూ ఇలా అన్నాడు. "జడేజాను చెన్నై సూపర్ కింగ్స్ ఖచ్చితంగా రిటైన్ చేసుకోవాలి. అతను %జూఖ%కు గన్ ప్లేయర్. చెన్నై జట్టు కోసం ఎన్నో సంవత్సరాలు అతను చేసిన కృషి మరువలేనిది. కాబట్టి సర్ జడేజా చెన్నై జట్టుతోనే ఉండాలి". అని రైనా చెప్పుకొచ్చాడు. పెద్ద పెద్ద స్పోర్ట్స్ నివేదికలు ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేయడంతో ఈ ట్రేడింగ్ దాదాపు సెట్ అయినట్టు సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. జడేజా ఇప్పటివరకు 254 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. ఈ మెగా టోర్నమెంట్‌లో ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, దినేష్ కార్తీక్ తర్వాత అత్యధిక మ్యాచ్ లాడిన ఐదో ప్లేయర్ గా నిలిచాడు. 143 వికెట్లతో చెన్నై సూపర్ కింగ్స్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ కూడా జడేజాని కావడం విశేషం. 16 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలను సాధించాడు. ధోనీతో పాటు అత్యధిక ప్లేయర్-ఆఫ్-ది-మ్యాచ్ అవార్డులు (16) కూడా జడేజా సొంతం. 2022లో జడేజాను చెన్నై కెప్టెన్ గా నియమించిన జట్టు ఘోరంగా ఆడడంతో మళ్ళీ ధోనీనే సారధిగా నియమించింది. 19 ఏళ్ల వయసులో జడేజా ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించిన తొలి జట్టు ఆర్ఆర్. 2008లో అతను టైటిల్ గెలుచుకున్న తొలి జట్టు కూడా అదే. జడేజా మొదటి రెండు సీజన్లలో ఆర్ఆర్ తరఫున ఆడాడు. 2010లో ముంబై ఇండియన్స్‌తో నేరుగా ఒప్పందంపై చర్చలు జరపడానికి ప్రయత్నించినందుకు ఐపీఎల్ అతనిని సస్పెండ్ చేసింది. నిషేధం తర్వాత జడేజా 2011లో కొచ్చి టస్కర్స్ తరఫున ఆడాడు. 2012లో %జూఖ% 2 మిలియన్లకు కొనుగోలు చేసింది.

## జమ్మూ కాశ్మీర్ చారిత్రాత్మక గెలుపు.. 65 సంవత్సరాల తర్వాత రంజీ ట్రోఫీలో ఢిల్లీపై విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో భాగంగా జమ్మూ కాశ్మీర్ చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. రంజీ ట్రోఫీలో ఢిల్లీని ఓడించి సంచలన విజయాన్ని నమోదు చేసింది. 65 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ ట్రోఫీలో ఢిల్లీపై జమ్మూ కాశ్మీర్ గెలవడం విశేషం. రాజధానిలో ఒక రోజు ముందు జరిగిన పేలుడు తర్వాత కట్టుదిట్టమైన భద్రత మధ్య మ్యాచ్ జరిగింది. మంగళవారం (నవంబర్ 11) అరుణ్ జైట్లీ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై జమ్మూ కాశ్మీర్ అలవోక విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో జమ్మూ కాశ్మీర్ ఈ సీజన్‌లో రెండో విజయాన్ని నమోదు చేసుకొని గ్రూప్ డి స్టాండింగ్స్‌లో ముంబై తర్వాత రెండో స్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే టాస్ గెలిచి జమ్మూ అండ్ కాశ్మీర్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ బ్యాటింగ్ లో విఫలమైంది. జమ్మూ అండ్ కాశ్మీర్ పేసర్ ఔకిబ్ నబీ 35 పరుగులకు 5 వికెట్లు పడగొట్టడంతో ఢిల్లీ తమ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు ఆలౌటైంది. వంశజ్ శర్మ (2/57), అబిద్ ముష్తాక్ (2/30) రాణించారు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూ అండ్ కాశ్మీర్ 310 పరుగులు చేసింది. కెప్టెన్ పరాస్ డోగ్రా 106 పరుగులు చేసి జట్టును ముందుండి నడిపించాడు. అబ్దుల్ సమద్ 85 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడడంతో పాటు.. కన్హయ్య వాధవన్ (47) రాణించాడు. తొలి ఇన్నింగ్స్ లో వీరు ముగ్గురు అద్భుతమైన బ్యాటింగ్ కారణంగా జమ్మూ అండ్ కాశ్మీర్ కు తొలి ఇన్నింగ్స్ లో 99 పరుగుల ఆధిక్యం లభించింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ లో ఢిల్లీ 277 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ ఆయుష్ బడోనీ 72, ఆయుష్ దోసేజా 62 పరుగులతో రాణించారు. ఒక దశలో 5 వికెట్ల నష్టానికి 267 పరుగులతో పటిష్టంగా కనిపించిన ఢిల్లీ చివరి ఐదు వికెట్లను 10 పరుగుల తేడాలో కోల్పోయింది. స్పిన్నర్ వంశజ్ శర్మ 68 పరుగులకు 6 వికెట్లు పడగొట్టి ఢిల్లీ వెన్నువిరిచాడు. 179 పరుగుల స్వల్ప టార్గెట్ ను జమ్మూ అండ్ కాశ్మీర్ మూడు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి గెలిచింది.

# తొలి టెస్టుకు ర్యాంక్ టర్నర్ లేదు.. ఈడెన్ గార్డెన్ పిచ్‌పై క్లారిటీ ఇచ్చిన గంగూలీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరగనున్న తొలి టెస్టుపై ఆసక్తి నెలకొంది. నవంబర్ 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ తొలి టెస్టుకు ఆతిథ్యమిస్తుంది. ఓ వైపు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్న సౌతాఫ్రికా.. మరోవైపు స్వదేశంలో తిరుగులేని టీమిండియా. దీంతో ఈ టెస్ట్ మ్యాచ్ పై భారీ హైప్ నెలకొంది. ఈ మ్యాచ్ కు టికెట్స్ కూడా ఇప్పటికే సోల్డ్ ఔట్ అయిపోవడం విశేషం. సొంతగడ్డ కావడంతో టీమిండియా ఈ మ్యాచ్ లో ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. ఆరేళ్ల తర్వాత ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ లో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కు ముందు పిచ్ ఎలా ఉండబోతుందో బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (%జూాదీ%) అధ్యక్షుడు గంగూలీ ఒక క్లారిటీ ఇచ్చారు. ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరగబోయే తొలి టెస్టుకు భారత క్రికెట్ జట్టు స్పిన్-ఫ్రెండ్లీ పిచ్ కోసం రిక్వెస్ట్ చేయలేదని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (%జూాదీ%) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ధృవీకరించారు. ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు యాజమాన్యం ర్యాంక్-టర్నర్ పిచ్ కావాలని అడగకపోవడంతో ఈ మ్యాచ్ లో బ్యాటర్లు పరుగుల వరద పారించడం ఖాయంగా కనిపిస్తుంది. గత ఏడాది న్యూజిలాండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో 0-3 తేడాతో ఓడిపోవడంతో ప్రత్యేక స్పిన్ ట్రాక్స్ తయారు చేయడంలో కాస్త వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తుంది. పిచ్ గురించి క్యూరేటర్ మాట్లాడుతూ ఇలా అన్నాడు. " పిచ్ పై చాలా త్వరగా పగుళ్లు కనిపించే అవకాశం ఉంది. ఆట ముందుకు సాగుతున్న కొద్దీ బంతి గరుకుగా మారుతుంది. ఇలా జరగడం వలన రివర్స్ స్వింగ్‌కు హెల్ప్ అవుతుంది. బుమ్రాలాంటి ఫాస్ట్ బౌలర్లకు ఇది కలిసొచ్చే విషయం. వికెట్ స్థిరంగా బౌన్స్ అవడంతో పాటు బ్యాటర్లకు సహకరిస్తుంది. నిజానికి ఇది చాలా మంచి బ్యాటింగ్ వికెట్. అని పిచ్ క్యూరేటర్ తెలిపారు. 2019లో ఇండియా- బంగ్లాదేశ్ పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్ తర్వాత ఈడెన్‌లో జరగబోయే తొలి టెస్ట్ ఇదే కావడం గమనార్హం.



# సంతాన ప్రాప్తిరస్తు.. చాందిని మెరుపులే మెరుపులు





ఒక తెలుగమ్మాయికి అవకాశం రావడమే గొప్ప అనుకుంటే, ఇప్పుడు చాలా మంది తెలుగమ్మాయిలదే గ్లామర్ ఇండస్ట్రీలో హవా. కేవలం తెలుగు చిత్రాల్లోనే కాదు, ఇరుగు పొరుగు భాషల్లోను రాణిస్తున్న తెలుగమ్మాయిలు ఉన్నారు. ఇక సోషల్ మీడియాలు, ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా తమను తాము పరిచయం చేసుకుని నటీనటులుగా ఎదుగుతున్న వారు ఉన్నారు. ఆరంభం లఘు చిత్రాలతో పాపులరైన చాందిని చౌదరి తెలుగు చిత్రసీమలో కథానాయికగా అవకాశాలు అందుకుని, బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో కెరీర్ బండిని నడిపిస్తున్న సంగతి తెలిసిందే. కొన్నేళ్లుగా చాందిని చౌదరి నటనా రంగంలో కెరీర్ ని విజయవంతంగా కొనసాగిస్తోంది. కేటుగాడు సినిమాతో తెలుగు సినిమారంగంలోకి ప్రవేశించిన చాందిని విశాఖ అమ్మాయి. బెంగళూరులో చదువుతున్న సమయంలోనే లఘుచిత్రాలలో నటించింది. ఆరంభం యమ్.ఆర్ ప్రొడక్షన్స్ వారి %-%ది వీక్%-% అనే లఘు చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత ప్రేమ ప్రేమ, లవ్ ఎట్ ఫస్ట్ సైట్, ట్రూ లవ్, అప్రోచ్, ప్రపోజల్, మధురం, సాంబార్ ఇడ్లీ, లక్కీ, టూ సైడ్ లవ్, ఫాల్ ఇన్ లవ్, రోమియో జూలియట్ ఇలా వరుసగా లఘు చిత్రాలలో నటించగా చాందినికి గుర్తింపునిచ్చాయి. మొదట్లో యువ కథానాయకుడు రాజ్ తరుణ్ తో కలిసి చాలా లఘు చిత్రాలలో నటించి విజయవంతమైన జంటగా పేరు తెచ్చుకున్నారు. అందులో ఒకటి %-%ది బ్లైండ్ డేట్%-%. అయితే ఈ జంట పెద్ద తెరపై మాత్రం కలిసి నటించలేదు.

2013లో వచ్చిన మధురం లఘుచిత్రంలో చాందిని నటనను చూసిన ముళ్ళపూడి వరా, కె.రాఘవేంద్రరావులు %-%కుందనపు బొమ్మ%-% అనే చిత్రంలో అవకాశం ఇచ్చారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా 2015 జనవరిలో ప్రారంభమైంది. 2015లో కేటుగాడు చిత్రంతో తెలుగు చలన చిత్ర తెరకు పరిచయం అయ్యింది. అంతకుముందు తను లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ప్రేమ ఇష్క్ కాదల్ సినిమాలలో చిన్న పాత్రలు పోషించింది. ఆ తరువాత కేటుగాడు సినిమాలో కథానాయికగా నటించిన చాందిని బ్రహ్మోత్సవం, శమంతకమణి సినిమాలలో కూడా నటించింది. 2018లో వచ్చిన మను సినిమాలో తన పాత్రకు ప్రశంసలు అందుకుంది. 2020లో సుహాస్ సరసన కలర్ ఫోటో సినిమాలో నటించింది. ఆ తర్వాత కెరీర్ పరంగా వెనుదిరగలేదు. ఇప్పుడు చాందిని చౌదరి కథానాయికగా, విక్రాంత్ కథానాయకుడిగా నటించిన %-%సంతాన ప్రాప్తిరస్తు%-% విడుదలకు సిద్ధమవుతోంది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్‌లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్విప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. ఈ సినిమా టీజర్ , ట్రైలర్‌కు ఇప్పటికే అద్భుత స్పందన వచ్చింది. నవంబర్ 14న సినిమా థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం సాయంత్రం ప్రీరిలీజ్ వేడుకలో చిత్రబృందం సందడి చేసింది. ఈ వేడుక ఆద్యంతం చాందిని చౌదరి మిరుమిట్లు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. అచ్చ తెలుగు అమ్మాయి ట్రెడిషనల్ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించింది. ఈ సినిమా ట్రైలర్ కు పాజిటివ్ బజ్ రావడంతో చిత్రబృందం రెట్టించిన ఆనందంతో ప్రచారంలో వేగం పెంచింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com